సంపుటం 13 సంచిక 172

రిజిష్టరు నెం- H 45 స్థాపితం 1925

గోలకొండపత్రిక

హైదరాబాదు 2—7—1960 శనివారం

సంపాదకుడు: ఎన్. నరోత్తమరెడ్డి ఎం. ఎ.

4 పేజీలు 7 నయాపైసలు

10/1/92

ఆసియాలోకెల్ల పెద్దదైన ఎలక్ట్రికల్ ఫ్యాక్టరీ

భోపాల్, జూలై 1: భారతదేశంలోమొదటిసారిగా భోపాల్ లో భారీ ఎలక్ట్రికల్ ఫ్యాక్టరీలో ఉత్పత్తి నేడు ప్రారంభ మయినది. ఇది మొత్తం ఆసియాలోనే పెద్దఫ్యాక్టరీ. పవర్ స్విచ్ గేర్, కంట్రోల్ పేనల్స్, పవర్ ట్రాన్సుఫార్మర్స్, కెపాసిటర్స్. ట్రాక్షన్ మోటార్లు ఎలక్ట్రికల్ లోకోమోటివ్‌ల పరికరాలు, పారిశ్రామిక మోటార్లు. హైడ్రో థెర్మల్ జనరేటర్లు యీ ఫ్యాక్టరీ లో ఉత్పత్తి చేయబడు తున్నవి. ఏడేండ్లలో యీ ఫ్యాక్టరీ మొత్తం అన్నిరకాల విద్యుత్ పరిక రాలనూ ఉత్పత్తి చేసే విధంగా అభివృద్ధి పరచ బడుతుంది.

నేడే సమ్మెవిషయం అటోయిటో తేలుతుంది

న్యూఢిల్లీ, జూలై 1: కేంద్ర కార్మిక మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా 11వ తేదీనుండి సమ్మెచేస్తామంటున్న కేంద్ర ప్రభుత్వోద్యోగుల సంఘాల నాయకులతో సుదీర్ఘచర్చలు జరిపిన తర్వాత మంత్రివర్గ సమావేశంలో పార్లమెంటు విలేఖరులతో ముచ్చటిస్తూ చర్చలు రేపు ఏదో కొలిక్కి రాగలవన్నారు. జీవనవ్యయ ప్రమాణంతో కరువుభత్యాం కలపాలనీ, ఐ. ఎల్. సి. సిఫార్సుప్రకారం కనీసవేతనాల్ని నిర్ణయించా లనే ఉద్యోగుల డిమాండ్లను ఆమోదించలేమన్నారు. మిగిలినడిమాండ్లను పరిశీలిస్తామన్నారు. మంత్రివర్గ సమావేశానంతరం వర్తానీ నెహ్రూ తాత్కాలిక రాష్ట్రపతి డా॥ రాధాకృష్ణన్‌ను కలిశారు.

కౌలుదార్ల బేదఖలీలను నిరోధిస్తూ రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వు చేసింది

శాసన సభలో ఉపముఖ్య మంత్రి శ్రీ రంగారెడ్డి వెల్లడి

ప్రస్తుత భూసంస్కరణల బిల్లు వలన వ్యవసాయ వ్యవస్థలో పెద్ద మార్పేదీ రాదనీ రెండో రోజు చర్చలో పలువురి సభ్యుల ప్రసంగాలు

ఈ బిల్లు రాజ్యాంగ విరుద్ధమని కొండయ్యచౌదరి వాదన

హైదరాబాద్, జులై 1

భూసంస్కరణ బిల్లు రాజ్యాంగ రీత్యా ప్రజలకు సంక్రమించిన అనేక హక్కులకు భంగకరంగా ఉన్నందున అది రాజ్యాంగ విరుద్ధమైనదిగా వాదిస్తూ యీ బిల్లును సుప్రీంకోర్టుకు పంపి అభి ప్రాయం కోరి, చాల్సిందిగా రాష్ట్రపతిని కోరడమే సబబు అంటూ యీ వేళ రెండోరోజు చర్చలో స్వతంత్ర పార్టీ సభ్యుడు శ్రీ దివి కొండయ్య చౌదరి రాష్ట్ర శాసన సభలో ప్రకటించారు.

చట్టాలు చేసి తద్వారా రాష్ట్ర ప్రభుత్వంగాని. కేంద్రంగాని, ప్రాథ మికహక్కులను నిరాకరించేఅధికారం లేదని శ్రీకొండయ్యచౌదరి అన్నారు. అంతేకాక వ్యక్తులుకూడా తమ ప్రాథ మిక హక్కుల్ని వదులుకోజాలర న్నారు. ప్రాథమిక హక్కులు తొల గింపబడరానివనీ అయితే యీ బిల్లు ద్వారా భూమిని సంపాదించి, నిర్వ హించి, యాజమాన్యం వహించి, అవ సరమైతే అమ్మివేసే హక్కును భూ స్వాములకు లేకుండాచేయడం అవు తున్నదని శ్రీ కొండయ్యచౌదరి అన్నారు. పైగా ఈ బిల్లుద్వారా భూస్వాములకు, ఇతర రకాల ఆస్తి గలిగినవారికి మధ్య విచక్షణ చూప బడుతున్నదన్నారు. పైగా నష్టపరిహా రపు రేట్లు, భూముల వర్గీకరణకూడా సరిగాలేదని ఆయన అభిప్రాయం వెల్ల డించారు. నష్టపరిహారం తగినంతగా —యీబిల్లువల్ల— భూస్వాములకు లభిం చదనీ, నష్టపరిహారపు రేటు భూముల మార్కెటురేటు ఆధారంగా నిర్ణ యింపబడాలనీ ఆయన వాదిస్తూ జీవితభీమా సంస్థలను జాతీయీకరించి నప్పుడు వాటికి ఇవ్వబడిన నష్టపరి హారం అధికంగా ఉందని చెప్పారు. కాని భూములకు ఇచ్చేనష్ట పరిహారం రేటు చాలతక్కువగా ఉండడం కూడా విచక్షణ చూపుతున్నారన డానికి ఆయన నిదర్శనంగా పేర్కొ న్నారు.

తాను యీభూసంస్కరణలబిల్లును వ్యతిరేకిస్తున్నంత మాత్రాన తాను సాంఘికన్యాయాన్ని చేకూర్చడానికే వ్యతిరేకిస్తున్నట్లు భావించరాదని శ్రీ కొండయ్యచౌదరి పేర్కొన్నారు. భూసంస్కరణల బిల్లుద్వారా రాష్ట్ర ములోని మధ్యతరగతి భూస్వాములు దెబ్బతింటారనీ రాష్ట్రంలోని భూ స్వాములు చాలమంది మధ్యతరగతి వారేననీ ఆయన భావించారు.

ఈబిల్లు శీఘ్రవిప్లవ వాదిత్వ భావన తో కూడిఉందనీ కేవలం అన్యాయ మనీ శ్రీ దివి కొండయ్య చౌదరి వాదించారు.

బిల్లుకు శ్రీ ఎక్కోటే సమర్థన

శ్రీ గోపాలరావు ఏక్కోటే (కాం) పదేళ్లనుండి యీ సంస్కరణల వ్యవహారం అలోచిస్తబడుతున్నదనీ ప్రస్తుతం సభవారి ముందున్న బిల్లు 1958లో ప్రవేశపెటబడిందనీ అన్ని స్థాయిలలోనూ బిలు అంశాలన్నీ యీవరకు క్షుణ్ణంగా చర్చించబడి ఉన్నవనీ అన్నారు. ఈ బిల్లు అనేక విధాల రాజ్యాంగ వ్యతిరేక మనడం పొరబాటన్నారు. అధికోత్పత్తిని సాధిస్తూ ఉన్నతస్థాయి వ్యవసాయిక సామర్థ్యాల్ని సమాణాల్ని సమ కూర్చడమే భూ సంస్కరణల ముఖ్యోద్దేశమని శ్రీఎక్కోటే అన్నారు. ప్రజల్లో అధికసంఖ్యాకులు గరిష్ఠ భూప్రమాణనిర్ణయాన్ని కోరుతున్నా రని ఆయన పేర్కొన్నారు.

దేశం ముఖ్యంగా వ్యవసాయిక దంటూ ఆయన దేశ స్వాతంత్ర్య సముపార్జన కాలంనుండీ నేటివరకూ భూస్వామికి ప్రభుత్వానికి మధ్యగల దళారుల్ని తొలగిస్తూ వస్తున్నా రన్నారు. భూమి గరిష్ఠప్రమాణాన్ని నిర్ణయించినంత మాత్రాన లాభములే దని, భూస్వామి-రైతుల సంబంధాలు కాలు రేట్లనూ కూడా స్థిరపరచాలనీ ఇలా కొన్ని రాష్ట్రాలలో చట్టాలు చేయబడ్డాయనీ కొందరు వ్యవసాయం చేయని భూస్వామిత్వాన్ని వ్యతిరే కించారనీ శ్రీ ఎక్కోటే వివరించారు. ఈనాడు బిల్లును రాజ్యాంగ విరుద్ధమని వాదిస్తూ దాన్ని విరమించుకోడము తగదని కూడా శ్రీ ఎక్కోటే హెచ్చ రించారు. పైగా బిల్లులో సూచింప బడిన నష్ట పరిహారం రేటు ఇంకాతగ్గిం చాలని తాను భావిస్తున్నట్లా యన చెప్పారు. ఆర్థిక వత్యాసాలను తొల గించడంలోతోడ్పడే భూసంస్కరణలు దేశానికి చాల అవసరమన్నారు.

త్వరలోనేభూసంస్కరణలకుచెందిన అన్ని అంశాలతో ఒక సమగ్రమయిన బిల్లు ప్రవేశపెట్ట బడాలని ఆయన కోరారు.

శ్రీ కడప కోటిరెడ్డి (కాం)సీలింగ్ నిర్ణయం చాల సహేతుకంగా ఉందని అన్నారు. తమతోపాటు ఇతర ఆస్తుల యజమానులకు కూడా సీలింగు విధిం చకపోవడం వలన ఈబిల్లు అన్యాయ మని కొందరుభావిస్తే భావించవచ్చు గాక అయినా ఐదెకరాలలోపు భూ ములు కలవారే ఎక్కువగా ఉన్నం దున ఉత్పత్తి అధికం కాలేదని భావిస్తు న్నానని శ్రీ కోటిరెడ్డి అన్నారు. దేశ పారిశ్రామికీకరణమే దారిద్ర్య నిర్మూలనకు అవసరమన్నారు. నష్టపరి హారం ఇచ్చేప్పుడు గడచిన మూడేళ్ళ ఆదాయాన్ని కాక ఐదేళ్ళ ఆదాయా న్ని లెక్కలోకి తీసుకోవాలనీ లేక పోతే వర్షాభావం వలన ఇటీవలగా నష్టపోయిన రాయలసీమ రైతులకు అన్యాయము జరుగుతుందని శ్రీకోటి రెడ్డి సూచించారు.

శ్రీ సి.హెచ్. రాజేశ్వర రావు (కమ్యూ) ఈ బిల్లు భూస్వాములకు ఏమాత్రం నష్టకారి కాదుకనుక స్వతం త్రపార్టీ సభ్యులు ఆందోళన చెంద నక్కర లేదు అన్నారు.

శ్రీ పి.వి. రాజేశ్వరరావు (కాం) ఆదాయ పరిమితిగా మునుపు నిర్ణయ మనుకొన్న రు. 5400 కన్న ఇప్పటి ఎకరాపరిమితి నిర్ణయం ఎక్కువగా ఉందనీ నష్టపరిహారం రేటు కూడా అంత ఉండనక్కరలేదనీ అన్నారు.

శ్రీ బొమ్మకంటి సత్యనారాయణ రావు (కాం) ఆర్.డి.ఓలకు యిచ్చిన అధికారాలు (బిల్లువర్తింపును మినహా యించే నిర్ణయాలను గూర్చి) విస్తృ తంగా ఉన్నాయని విమర్శించారు. ఈ అధికారాలను ఇతరులు ఒత్తిడితెచ్చి దుర్వినియోగ పరచకుండా జాగ్రత్త పడాలన్నారు. భూ సంస్కరణల దృష్ట్యా ఈవరకే తెలంగాణాలో— బహుశా ఆంధ్రలోకూడా— భూస్వా ములు అదనపు భూములను అమ్మివేసు కున్నారన్నారు.

శ్రీ కె. ఆనందరావు (కమ్యూ) ఈబిల్లుకు తెలంగాణచట్టానికీ చాలా తేడాఉందంటూ ఈబిల్లు భూస్వాముల పక్షాపాతంతో తయారయిందని ఆరో పించారు. కొత్త గరిష్ఠప్రమాణంచూసి తెలంగాణ భూస్వాములు తమ కౌలు దార్లకు అమ్మని భూములను తిరిగి సంపాదించుకుందామను కుంటున్నట్లు ఆయన చెప్పారు

ఈ సందర్భంలో రివెన్యూ మంత్రి శ్రీ కొండా వెంకట రంగారెడ్డి జోక్యంకలిపించుకొని అలా జరుగకుండా ఉత్తర్వులు యివ్వబడినవనీ ప్రస్తుత భూముల ఏమీ మార్చడానికి వీలు లేదనీ చెప్పారు.

శ్రీ కె. రామచంద్రారెడ్డి(కమ్యూ) యీ బిల్లు భూస్వాములకు రక్షణ కల్పించేదిగా ఉందనీ పాత తెలంగాణ చట్టాన్నే రాష్ట్రం అంతటా అమలు పరచాలనీ కోరారు.

శ్రీ చెన్నయ్య (కాం) బిల్లును తీవ్రంగా విమర్శిస్తూ తాము భూ స్వాములను రక్షించదలిచామని స్పష్ట ముగా చెబితే బాగుండేదన్నారు. శ్రీ పున్నయ్య ప్రసంగిస్తుండగా అభినంద నలు అందజేస్తూ కమ్యూనిస్టు సభ్యులు బల్లలుగ్రుద్ది హర్షధ్వనులు చేశారు.

శ్రీ ఆనంతరెడ్డి, శ్రీ మందపాటి నాగిరెడ్డి (కమ్యూ) కూడా బిల్లును వ్యతిరేకించారు.

శ్రీ నాగిరెడ్డిప్రసంగంముగియకము నుపే సభ రేపటికి వాయిదా పడింది.

ఇండియాకు 42.2 కోట్ల అమెరికన్ ఋణాలు

ఒకేసారి ఏడు ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ, జులై 1

భారత దేశములోని వివిధ పథకాలకుగాను 42.2 కోట్ల విలువ మేరకు (89.3 మిలియన్ డాలర్లు) ఋణాలు ఇస్తూ ఒకే సారి 7 ఒప్పందాలమీద సంత కాలు జరిగినట్లు నేడు ప్రకటింప బడింది.

ఈఒప్పందాల ద్వారా లభించే ధన ములో కొంత భాగము (5 ఒప్పందా లకు చెందినది) విద్యుదుత్పత్తి సౌక ర్యాల పథకాలకోసము, మరోఋణం అభివృద్ధి బ్యాంకుకోసము, ఇంకొకటి అమెరికాలో తయారైన జీపు, ట్రక్కుల విడిభాగాల దిగుమతికోసం వినియోగింపబడుతాయి. ఈ విడిభా గాలతో ఇండియాలోని మోటారు నిర్మాణ కర్మాగారాల్లో జీపులు, ట్రక్కులు నిర్మాణముచేసేందుకుగాను రోడ్ ట్రాన్స్‌పోర్టు ఋణము 6.2 కోట్లు వినియోగపరచ బడుతుంది. ఇలా ఈదిగుమతి చేయబడే అమెరికా విడిభాగాలతో ఇండియాలో తయా రయ్యే భాగాల్నికూడా కలిపి 5వేల జీపులు, 800 జీపు స్టేషన్ వాగన్లు, 800 జీపు స్టేషన్ వాగన్లు, 800జీపుట్రక్కులు, 800 డాడ్జు టన్నుట్రక్కులు, 8వేల డాడ్జు మూడు టన్నుల ట్రక్కు తయారు చేయబడుతాయి.

విద్యుదుత్పత్తి పథకాలకోసము ఇందుండి యీ దిగువ ప్రాజెక్టులకు ఋణాలు లభిస్తాయి:

అహ్మదాబాద్ ఎలక్ట్రిసిటీ కంపెనీ, బనారసీధర్మల్ పవర్ ప్రాజెక్టు, శరావతీ హైడ్రో-ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, దుర్గాపూర్ థర్మల్ పవర్ స్టేషన్, చంద్రపురా థర్మల్ పవర్ ప్రాజెక్టు అన్నింటికీ కలిపి 66.1 మిలియన్ డాలర్లు లభిస్తాయి.

పారిశ్రామికార్థిక కార్పొరేషన్ అభివృద్ధి బ్యాంకుకై 10 మిలియన్ డాలర్లు ఇవ్వబడుతాయి.

హైద్రాబాద్‌లో "డ్రగ్ బ్యాంక్"

పేద రోగులకు, ధర్మ వైద్యశాలలకు, సాంఘిక సంస్థలకు సహాయం నిమిత్తం ఏర్పాటు

హైద్రాబాద్, జులై 1

ధర్మ వైద్యశాలలకు, సాంఘిక సంస్థలకు, పేదరోగులకు సహాయపడే నిమిత్తం అన్నిరకాల డ్రగ్గులను, మందులను, మాత్ర లను సేకరించే ఉద్దేశంతో ఆంధ్రప్రదేశ్ కెమిస్ట్‌లు. డ్రగ్గిస్టుల సంస్థ ఒక "డ్రగ్ బ్యాంక్"ను ప్రారంభించింది.

ఈ డ్రగ్ బ్యాంకు కూడా యితర బ్యాంకులవలెనే పనిచేస్తుంది. అంటే డాక్టర్లు, కెమిస్టులు, ఉత్పత్తిదారులు, తదితరులు తమ వద్దనున్న ఉపయో గింపబడని మందులను యీ బ్యాం కులో డిపాజిట్ చేయవలసిందిగా అభ్యర్థించబడుతారు. ఆ మందులను అవసరమైనప్పుడు చికిత్సకోసం వినియోగించుకోవచ్చు, లేదా ఈ బ్యాంకులో మందులను కొని నిలువ చేసేందుకు ధనరూపంలో కూడా విరాళాలివ్వవచ్చు. తమ వద్ద వాడ కుండా ఉన్న మందుల్ని యీ బ్యాం కుకు ఇవ్వవలసిందిగా డా॥ రమేశ్ గాంధి నేడొకవిజ్ఞప్తి ప్రకటనచేశారు.

ఇలా చేకూరిన మందులను ఆయా ఆసుపత్రులనుండి డాక్టర్లనుండి సర్టి ఫికెట్లు తెచ్చిన పేదరోగులకు, ధర్మ సంస్థలకు, సాంఘిక సంస్థలకు అందజే స్తారు. విరాళాలు హనుమాన్ పేక్ లోని (రెడ్డి హాస్టలు గల్లి) సంస్థ ఆఫీ సుకు పంపవచ్చునని కూడా డా॥ రమేశ్ గాంధి ప్రకటించారు.

పోస్టాఫీసు సేవింగ్సు సర్టిఫికెట్లు, ఖాతాలు

నామినేషను సౌకర్యాలు

న్యూఢిల్లీ, జూలై 1

నేషనల్ సేవింగ్సుసర్టిఫికెట్లుకొన్న వారికి పోస్టాఫీసు సేవింగ్సు బ్యాంకు ఖాతాదార్లకు, సొమ్ము మొత్తము రు. 5000 కు మించినప్పుడు, ఇతరు లను తమ అనంతరం వారసులుగా నామినేటు చేయడానికి అవకాశము కల్పిస్తూ భారత ప్రభుత్వం యీవేళ నియమనిబంధనలను ప్రకటించినట్లు ఆర్థిక మంత్రిత్వశాఖ నేడొక పత్రికా ప్రకటనలో వెల్లడించింది. ఈ నియమ నిబంధనలు 1960 ఆగస్టు 1వతేదీనుంచి అమలులోకి వస్తాయి. ఈ నిబంధనల ప్రకారం 12 ఏళ్ళు, 7 ఏళ్ళు, 5 ఏళ్ల నేషనల్ సేవింగ్సు సర్టిఫికెట్లు 10ఏళ్ళ నేషనల్ ప్లాన్ సర్టిఫికెట్లు కొన్నవారు పోస్టుఆఫీసు సేవింగ్సుబ్యాంకు,క్యుమ్యు లేటివ్ టైమ్ డిపాజిట్స్ పథకంలో ఖాతాదార్లఒకవ్యక్తినిగానిఅనేకవ్యక్తు లనుగానివారసులుగానామినేట్ చేయ వచ్చును. తమకు రావలసిన సొమ్మును తాము మరణించిన సందర్భంలో నామినేట్ చేయబడిన వ్యక్తికి లేదా వ్యక్తులకు, వారు తమహక్కును చట్ట రీత్యా రుజువు పరుచుకోనవసరం లేకుండానే, చెల్లించడం అవుతుంది.

ఈ సొమ్ము చెల్లించే సందర్భంలో ఇతర వ్యక్తుల హక్కులు పరిగణించ బడవు. మైనర్లతోసహా సర్టిఫికెట్లు కొన్నటువంటివీ లేదా తమ పేరిట ఖాతా ఉన్నటువంటివీ వ్యక్తిగత ఖాతాదార్లకు సర్టిఫికెటు కొనుగోలు దార్లకూ మాత్రమే యీనామినేటు చేసే హక్కు ఇవ్వబడుతుంది.

కంకిపాడు పంచాయతీ ఉపాధ్యక్షుని హత్య

విజయవాడ, జూలై 1

కంకిపాడులో మొన్న ఉదయం సయ్యద్ అబ్దుల్లా కొడుకు మస్తాన్ మద్దాలి మాధవరావును, మద్దాలి రామకృష్ణయ్యలను పేపర్‌కప్పుతో పొడిచాడు. మాధవరావు వెంటనే మరణించగా రామకృష్ణయ్య తీవ్రంగా గాయాలతో విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. ముద్దాయి వెంటనే పోలీసు స్టేషనుకు వెళ్ళి రిపోర్టుచేసి కత్తి స్వాధీనం చేసి నాడు. అతనినిఅరెస్టుచేసి రిమేండులో వుంచారు. బంజరు భూమి తగాదాల ఈవల్లఉదంతంజరిగిందని తెలుస్తున్నది

అన్నిపార్టీల శాసన సభ్యుల సమీకరణ

లోకసభ స్పీకరు

శ్రీ అనంతశయనం ఉద్బోధ

హైదరాబాద్, జూలై 1

లోక సభ స్పీకర్ శ్రీ మాడభూషి అనంతశయనంఅయ్యంగార్ నేడిక్కడ అసెంబ్లీ కమిటీ హాలులో భారతపార్ల మెంటరీ సమితి ఆంధ్రప్రదేశ్ శాఖకు ప్రారంభోత్సవంచేస్తూ యిట్టిసంఘాలు పార్టీలతో నిమిత్తం లేకుండా శాసన సభ్యులందరినీ సమీకరిస్తాయన్నారు.

దేశంలో లోక సభ, రాజ్య సభ, ఎగువ, దిగువ సభల సభ్యుల సంఖ్య 4000 వరకూ ఉంది. ఇట్టి సంఘము పరస్పర శ్రద్ధాసక్తులు గల అంశాల్ని చర్చించడానికే, కేంద్ర, రాష్ట్రస్థాయి లలో నాయకత్వ నిర్మాణానికి దోహ దం చేస్తుందన్నారు.

రాష్ట్ర శాసన సభ స్పీకర్ శ్రీ కాళేశ్వరరావు అధ్యక్షతవహించారు. సంఘ కార్యదర్శి శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఉభయస్పీకర్‌లకూ స్వాగతం చెప్పారు. మరో కార్యదర్శి శ్రీ పి. వి. నరసింహారావు వందన సమర్పణం గావించారు.

గృహ వసతి బోర్డుఏర్పాటు

ఆంధ్ర ప్రాంతానికి కూడ త్వరలో విస్తరణ

హైద్రాబాదు, జూలై 1

తెలంగాణప్రాంతానికిఉద్దేశిం చబడినహైద్రాబాదు హౌసింగ్ (గృహవసతి) బోర్డు నేడు చట్ట బద్ధంగాఏర్పడింది. ఈసందర్భంలో బోర్డు అధ్యక్షుడైన స్థానిక సంస్థల మాజీ ఇన్‌స్పెక్టర్ జనరల్ శ్రీ ఎ. రాఘవరెడ్డి విలేఖరులతో ముచ్చటిస్తూ ఆంధ్ర ప్రాంతాన్ని కూడ యీబోర్డు పరిధిలోనికి తెస్తూ ప్రభుత్వ ఆజ్ఞలతోనే ఒక శాసనం తెస్తుందన్నారు.

హైదరాబాదు హౌసింగు బోర్డు సిటీ ఇంప్రూవ్‌మెంటు బోర్డు (సి. ఐ. బి.) పట్టణాభివృద్ధి ట్రస్టు (టి. ఐ.టి) సికింద్రాబాదు కార్యకలాపాల్నిచేపట్టి నది.

ప్రతివ్యక్తి ఆరోగ్య కరమయిన వాతావరణంలో తక్కువ ఖర్చుతో చక్కని యింటిని పొందేటట్లు చేయ డమే బోర్డుఆశయమని ఆయనన్నారు. బోర్డు సహకారగృహనిర్మాణ సంఘా ల్ని ప్రోత్సహిస్తూ గృహనిర్మాణవ్యవ హారాలలో సాంకేతిక సహాయాన్ని చేస్తుంది.

చివరకు టౌన్‌ప్లానింగు,హౌసింగు కార్యకలాపాల్ని విలీనంచేసి నగరాభి వృద్ధికి పునాదులు వేయవలసి ఉంటుం దన్నారు.

ఇండ్లు నిర్మించుకోవాలనుకొనేవారు ముందు తమపేర్లను బోర్డుతో రిజిష్టర్ చేయించుకోవాలిబోర్డుఎక్కువగాహౌ సింగ్‌స్థలాల్ని సేకరించి మురికిపేటలకు కూడ తన కార్యకలాపాల్ని విస్తరింప జేస్తుంది. భీమాకార్పొరేషను నిధులు సమకూర్చబడుతాయనీ లేకుంటే ఓపెన్‌మార్కెట్‌లో ఋణాన్ని సేక రించే అధికారం బోర్డుకున్నదనీ అయ నన్నారు.

ఈబోర్డు సభ్యులు శ్రీ కె. అచ్చు తారెడ్డి, (ఎం. ఎల్. ఏ.), మక్దుం మొహియొద్దీన్, (ఎం. ఎల్. సి.), శ్రీ ముప్పన రామారావు (పెద్దాపు రం), బాలాప్రసాద్ (భవనాల చీఫ్ ఇంజనీర్).

శాసనమండలికి 5 గురి నామినేషన్

కొత్తగా కమలా సంజీవరావు, అజాముద్దీన్‌లకు స్థానం

హైద్రాబాద్, జులై 1

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ భీమ్ సేన్ సచార్ శాసనమండలిలో తొలి జట్టు సభ్యులు రిటైరయిన భాగీలకు నలుగురిని నామినేట్‌చేశారు. వారి పేర్లు: తిరుపతి విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ శ్రీ ఎస్. గోవిందరాజులు నాయుడు. "ఆంధ్రపత్రిక" సంపాద కుడు శ్రీ శంభుప్రసాద్, శ్రీ మతి ఇల్లిందల సరస్వతి దేవి (రచయిత్రి), ముస్లింవాక్ బోర్డు అధ్యక్షుడున్యాయ వాది అయిన మహ్మద్ అజాముద్దీన్ (నవాబ్ జైన్‌యార్జంగ్ స్థానంలో)

ఎన్నెస్టు గిడియన్ మృతివలనఖాళీ అయిన భాగీకి గవర్నర్ శ్రీమతికమలా సంజీవరావును నామినేటు చేశారు.

వీరిలో మొదటిముగ్గురూ మండలి ప్రస్తుత సభ్యులే.

దేశ అవసరాలకు తగినంతగా ఉత్పత్తి

సాధించబడాలని గవర్నర్ సచార్ విజ్ఞప్తి

హైద్రాబాద్, జూన్ 1

గవర్నర్ శ్రీ భీంసేన్ సచార్ నేటి సాయింత్రం జూబిలీహాలులో జరి గిన సభలో "ఆకలి నిర్మూలనోద్యమా నికి" ప్రారంభోత్సవం చేస్తూ దేశావస రాల్ని అదుకోడానికి గాను వ్యవసా యోత్పత్తిని అధికం చేయాలన్నారు.

ప్రపంచంలోని ప్రస్తుత భవిష్యత్ జనాభాకు తగినంత అహారాన్ని సమ కూర్చడానికి తగినంతఉత్పత్తిని ఆయా దేశాలు సాధించేటట్లు ప్రోత్సహించ డమే యీఉద్యమ ఆశయమని ఆయ నన్నారు. ప్రపంచమంతాయీదినోత్స వం జరుపబడుతుందన్నారు.

ఈఉత్సవానికి అధ్యక్షత వహించిన రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీనూకల రామచంద్రారెడ్డివ్యవసాయోత్పత్తిని అధికం చేయడానికి కొత్తపద్ధతుల్ని అవ లంబించాలన్నారు. ప్రభుత్వం కల్పిం చిన అవకాశాల్ని పూర్తిగా వినియో గించుకోవాలని ఆయన రయితులకు విజ్ఞప్తి చేశారు.

వ్యవసాయ శాఖ కార్యదర్శి శ్రీ ఐ. జె. నాయుడు సభికులకుస్వాగతం చెప్పారు. వ్యవసాయశాఖడైరెక్టర్ శ్రీ డి. విశ్వనాథరెడ్డి వందన సమర్ప ణం గావించారు. లోకసభ స్పీకర్ శ్రీ అనంతశయనంఅయ్యంగార్ కూడ ఉత్సవానికి హాజరైనారు.

యు.పి. గవర్నర్‌గా శ్రీ బూర్గుల ప్రమాణ స్వీకారం

నైనిటాల్, జులై 1

ఉత్తరప్రదేశ్ గవర్నర్‌గా శ్రీ బూర్గుల రామకృష్ణారావు నేటి ఉద యము యిక్కడి రాజభవనములో ప్రమాణ స్వీకారం చేశారు. అలహా బాదు హైకోర్టుప్రధానన్యాయమూర్తి మూతం ప్రమాణము చేయించారు. ముఖ్యమంత్రి, మంత్రులు, శాసన సభ్యులు, ప్రభుత్వ కార్యదర్శులు హాజరయినారు.

దేశంలో విరివిగా మొక్కలను నాటాలి

వన మహోత్సవంలో రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, కేంద్ర, రాష్ట్ర వ్యవసాయ మంత్రుల విజ్ఞప్తి

న్యూఢిల్లీ, జులై 1

ఉపరాష్ట్రపతి డా॥ ఎస్. రాధాకృష్ణన్ ఈఉదయంరాష్ట్ర పతిభవనం ఉద్యానవనంలో 11వ వనమహోత్సవసందర్భాన రెండు కదంబమొక్కలను నాటారు. అనంతరం డా॥ రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ వనమహోత్సవం వలన విరివిగా చెట్లునాటడానికి ప్రజలకు ప్రోత్సాహము లభించగలదని ఆశిస్తు న్నానన్నారు. ప్రాచీన కాలములో భారతదేశంలోని ప్రజలు ప్రకృతికి సన్నిహితంగా నివసించేవారనీ ఏపుగా పెరిగిన చెట్లు, ఆశ్రమవాసుల కంటికి ఆహ్లాదం కలిగిస్తూ మనస్సును ఉత్తేజ కరంగా ఉండేదనీ, కాని యీనాడు మనం చెట్లను నిర్దాక్షిణ్యంగా నరికి వేస్తున్నామని డా॥ రాధాకృష్ణన్ అన్నారు. వనమహోత్సవము వలన విరివిగా చెట్లు పెంచడానికి ప్రజలకు ప్రోత్సాహము లభించగలదని ఆశిస్తు న్నాను.

రాష్ట్రపతి విజ్ఞప్తి

వనమహోత్సవసందర్భంగా రాష్ట్ర పతి డా॥ రాజేంద్రప్రసాద్ రిజార్డు ప్రసంగం నేడు ఆలిండియా రేడియో లో ప్రసారమయింది. విరివిగా చెట్ల ను నాటి దేశ అటవీ సంపదను పరి రక్షించాలని ఆయన విజ్ఞప్తిచేశారు.

భారత వ్యవసాయ మంత్రి డా॥ పంజాబ్‌రావు దేశ్‌ముఖ్ కూడ నేడు ఒక రేడియో ప్రసంగంలో మనము అందానికీ, ఉపయోగానికి అటవేతర ప్రాంతాలలోఅనేకచెట్లువేస్తూ సహజ సిద్ధమయిన అడవుల్ని నరికివేస్తుంటే ప్రయోజనమేమీ ఉండదన్నారు.

రాజభవనంలో వన మహోత్సవం

హైద్రాబాద్, జూలై 1

గవర్నర్ శ్రీ భీంసేన్ సచార్ శ్రీమతి లలితా సచార్, వ్యవసాయ మంత్రి శ్రీ నూకలరామచంద్రారెడ్డి వన మహోత్సవ సందర్భంగా నేడు రాజభవన్ గార్డెన్‌లో మొక్కలు నాటారు.

వ్యవసాయ మంత్రి విజ్ఞప్తి

రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ నూకల రామచంద్రారెడ్డి వనమహోత్సవ సందర్భంగా నేటి రాత్రి రేడియోలో ప్రసంగిస్తూ సేద్యానికిభూమి కావాలంటూ అడవుల్ని నరికి వేయ డాన్ని తీవ్రంగా విమర్శించారు.

ఎక్కువ చెట్లను నాటుతూ, అడ వుల్ని పెంపొందిస్తే వర్షపాతంఎక్కువై దేశంలో అధికాహారోత్పత్తికిదోహదం చేస్తుందన్నారు. భూసార పరిరక్షణకు చెర్వులు, కాల్వలు యింకిపోకుండా నిరోధించడానికికూడ దోహదము చేస్తుంది. రోడ్డు కిరువైపులా చెట్లను నాటితే బాటసారులకు నీడ లభిస్తుం దన్నారు. ఫలవృక్షాల్ని నాటితే ఆహారసమస్యకూడ తీరుతుందన్నారు. కేవలం యీ వనమహోత్సవం వారం లోనే చెట్లు నాటితే సరిపోదు. నాటిన చెట్లపట్ల తగు శ్రద్ధ వహించాలి.

రాష్ట్రంలోఅడవిమొత్తంభాగంలో ఐదోవంతే ఉన్నదనీ, యిది ఏమాత్రం సరిపోదనీ ఆయనన్నారు. అందువలన అడవుల్ని అభివృద్ధి పరచాలి.

ఘానా రిపబ్లిక్ తొలి అధ్యక్షుడు ఎన్ క్రుమా

అక్రా, జూలై 1

కామన్వెల్తులో రిపబ్లిక్‌గా అవత రించిన ఘానాకు ప్రథమ అధ్యక్షు డుగా డా॥ ఎన్ క్రుమా ప్రమాణ స్వీకారం చేశారు.

సోమాలి రిపబ్లిక్

నూతన సోమాలి రిపబ్లిక్ కూడ నేడే ఏర్పడింది. అనేక దేశాల ప్రతినిధులు హాజరైనారు.

అసెంబ్లీ ప్రశ్నోత్తరాలు:

54 మంది అధికారులపై అవినీతి నేరాలు

వారిలో 25 మంది గెజిటెడ్ ఉద్యోగులు కూడా ఉన్నారట: ప్లానింగ్ మంత్రి వివరణ

హైద్రాబాదు, జులై 1

సమాచార, ప్రణాళికశాఖలమంత్రి శ్రీ పి. రంగారెడ్డి నేడు ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రికి బదులుగా శ్రీ జె.టి. ఫెర్నాండెజ్ అడిగిన ప్రశ్నకు జవాబు చెబుతూ 1959 ఏప్రిల్ నుండి డిసెంబరువరకూ 54 అవినీతి నేరాలను కనుగొన్నారనీ అందులో 25గురు గెజిటెడ్ ఆఫీసర్లు, 29 మంది నాన్-గెజిటెడ్ ఉద్యోగులు కలరన్నారు. వీరిలో 9 గురు గెజిటెడ్ ఆఫీసర్లను డిబ్యునల్ ద్వారాను 16గురు ఎన్.జి.ఓ.లను ఆయా శాఖాధిపతుల ద్వారాను విచారించడానికి ఐ.జి.పి. సిఫార్సు చేశారనీ ఒక గెజి టెడ్ ఆఫీసరు విషయంలో ప్రాసిక్యూషన్‌ను కూడా ఆయన ప్రతి పాదించారనీ మంత్రి చెప్పారు.

శ్రీ వేమయ్య అడిగిన ప్రశ్నకు మంత్రి శ్రీ రంగారెడ్డి జవాబు చెబుతూ గూడూరు మునిసిపాలిటీకి 1959-60 సం॥లకు గాను మంచినీటి సౌకర్యాలకై ప్రభుత్వం 2 లక్షల 67 వేల రూపాయలను మంజూరు చేసిందన్నారు.

శ్రీ ఎస్. నారాయణప్ప అడిగిన ప్రశ్నకు సమాధానం చెబుతూ ప్రభు త్వము అనంతపూర్ కలెక్టర్‌కు వాణిజ్య పంటలపై భూమిశిస్తును, సర్‌ఛార్జిని వసూలు చేయవద్దని ఆదే శించిందన్నారు.

మంత్రుల నివాస భవనాల ఖర్చు

శ్రీ కాళిరెడ్డి అడిగిన ప్రశ్నకు మంత

ఉస్మానియా పట్టభద్రుల కాన్ఫరెన్స్

హైద్రాబాద్, జులై 1

ఉస్మానియా యూనివర్సిటీ పట్టభద్రుల సంఘంవారు తమ 28వ వార్షిక సమావేశాన్ని జులై తుదివారంలో జరుపనున్నారు. ఈ సందర్భంలో ఉస్మానియా యూనివర్సిటీ 1960 వార్షిక పరీక్షలలోఅన్ని విషయాలలోను ప్రథమశ్రేణిలో ఉత్తీర్ణులైన వారిలో అధిక మార్కులను పొందినవారిని ప్రోత్సహించుటకు గాను వారికి బహుమతులు ఒసగబడును. ఈ బహుమతి ప్రదానోత్సవానికి అధ్యక్షత వహించ వలసినదిగా భారత అధ్యక్షుడు డా॥ రాజేంద్ర ప్రసాద్‌ను కోరనైనది. రాష్ట్రవిద్యా, సాంఘిక, ఆర్థిక సమస్యలను ఈ సమావేశముచర్చించగలదు. ఈ విషయంలో ప్రతిపాదనలను పంపగోరువారు జులై 15 వ తేదీవరకు ఉస్మానియా పట్టభద్రుల సంఘ కార్యదర్శికి (ఎగ్జిబిషన్ గ్రౌండ్స్, హైద్రాబాద్) తమ ప్రతిపాదనలను పంపిన యెడల, వాటి సామంజస్యాన్ని బట్టి అవి తీర్మాన రూపంలో సమావేశంలో ప్రవేశ పెట్టబడును. కాన్ఫరెన్స్ సందర్భంలో ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని భాషలకు చెందిన రచయితలు వ్రాసిన గ్రంథాల ప్రదర్శన ఒకటి యేర్పాటు చేయ సంకల్పించ బడినది. అయినంత త్వరలో సంఘ కార్యదర్శిని కలుసుకొని ఆతనితోసహకరించ వలసినదిగా సంస్థలను, ట్యూటర్లను కోరనైనది.

జెర్రిపోతుల వాగుపై వంతెన అవశ్యకత

ఇటీవలి వర్షాలకు జంగాలపల్లి రోడ్డుకు గండి

వరంగల్, జులై 1

గత 28వ తేదీన కుండపోతగా కురిసిన వర్షంవల్ల ములుగు ప్రాంతంలో కొన్ని చెరువులకు గండ్లుపడిన కారణముగా జంగాలపెల్లి రోడ్డుకు గండి పడింది. ములుగునుండి వరంగల్‌కు తిరిగి వస్తున్న హాబీజ్య పరిశ్రమల శాఖ అసిస్టెంటు డైరెక్టర్ సహకార సంఘాల రిజిస్ట్రార్ డిప్యూటీ కలెక్టర్ (మానుకోట) పత్రికా విలేఖరులు "జెర్రిపోతులవాగు" పొంగటం వల్ల 27వ తేది మధ్యాహ్నం నుండి రాత్రి 2 గంటల వరకు రోడ్డుపై పడి గావులు పడిఉండడం తటస్థించింది.

ములుగుకు-వరంగల్‌కు దాదాపు ఒక దినం పూర్తిగా రాకపోకలు స్తంభించాయి. టప్పా నిలిచి పోయింది. ప్రతి సంవత్సరం వర్షాకాలం దాదాపు నెలరోజులపాటు రాకపోకలుస్తంభించి పోవటం మామూలవుతున్నది.

ఈ వాగు రోడ్డు లెవలుకు 7 అడుగులలోతువుంది. మామూలు చిన్న పాటి బ్రిడ్జినిర్మించినా పై అవరోధాలు ఏర్పడవు. ఈ వాగు ఉప్పొంగటంవల్ల గత సంవత్సరం ఇద్దరు మనుష్యులు చనిపోవటం, ములుగు ఆయా పరిసర ప్రాంతాలకు వెళ్ళదలచిన జిల్లా కలెక్టర్ తదితరులు తాటిచెట్లకు త్రాడుకట్టి దాటిపోవటం లాంటివి గత సంవత్సరం జరిగాయి. ములుగు వచ్చిన ప్రణాళిక మంత్రి శ్రీ రంగారెడ్డి త్వరపడి వెళ్ళకుంటే వారికి కూడా ఈ వాగు వొడ్డున పడిగావులు పడవలసి వచ్చేది. పి. డబ్ల్యు. డి. శాఖ దీని విషయంలో తగు నిర్మాణ కార్యక్రమానికి పూనుకొనని పక్షంలో ప్రజలకు ఈ ఇబ్బంది తొలగదు.

(మా-వి)

చవుక తిరుగు ప్రయాణపు టిక్కెట్ల నిలుపుదల

న్యూఢిల్లీ, జూలై 1

భారత రైల్వేలలో జూలై 15 నుంచి సెప్టెంబరు 15 వరకూ ఏసీటూ 1, 2, 3వ తరగతుల ప్రయాణీకులకు ఇచ్చే చవుక తిరుగు ప్రయాణపు టిక్కెట్లు యీ సంవత్సరం వుండవు

రైళ్ళలో రద్దీఎక్కువగా వుంటున్నందున చవుక తిరుగు ప్రయాణపు టిక్కెట్లు జారీచేయరాదని రైల్వే బోర్డు నిర్ణయించింది.

రు. 5/- లకు రేడియో



ఈ రేడియో విద్యుత్ మరియు బ్యాటరీ లేకుండా శ్రావ్యమైన సంగీతము నిచ్చును. మా నూతన స్కీము ప్రచారమునకు యిది ప్రవేశపెట్టనైనది. పరిమితమైన స్టాకు నిరాశ చెందక వెంటనే ఆర్డర్లు పంపండి.

American Radio House,
Goal Bagh/ R- 10/ Amritsar.

శార్వరి సం॥ ఆషాఢ శు॥ అష్టమి రా 9-4 హస్త రా 8-55 ఉ॥శే వ 6-39 వరకు తె వ 4-49నుంచి (శాలివాహన శకము: 11-4-1882) 1960 జూలై 2 శనివారము

"అధిపత్రైవర్ణికులకును యజ్ఞవిధుల, శ్రద్ధగలిమికి మిగుల ధర్మంబులేదు యజ్ఞమునకంటె నధికమైనదియుఁ గలదె, యజ్ఞకర్తయె చూవె సర్వాధికుండు".

-భారతము (శాంతి)

గోలకొండపత్రిక

ఫోన్. నెం. 3280

1960 జూలై 2

శనివారము

ఆసియాలో చైనా దురాక్రమణ చర్యలు

ఆసియా ఖండములో చైనా దురాక్రమణ చర్యల సంఖ్య నానాటికి పెరుగుచున్నది. ఆసియా దేశాలు యీ విషయమై సావధానముగా అప్రమత్తతతో నుండవలసిన అవసరము దినదినము అతిశయించుచున్నది. చైనా సైనిక శక్తి మరియు దాని వెనుకనున్న దురహంకారము పొరుగు రాజ్యాల భద్రతకు ప్రమాదకరముగా పరిణమించుచున్నది. ఈవారము జరిగిన సరికొత్త సంఘటన నేపాలు సరిహద్దు మీది దురాక్రమణ. ఇంతకు ముందు గావించిన దురాక్రమణల వలెనే యీ దురాక్రమణ గూడ చైనా విస్తరణ కాంక్షకు, సామ్రాజ్యతత్వమునకు నిదర్శనమై కమ్యూనిస్టు రాజ్యాలు పొరుగు దేశాలలోని ప్రాంతాలను కాంక్షించవని చెప్పుకొను మాటలు నూటికి నూరు పాళ్ళు అసత్యమని ఋజువు చేయుచున్నది.

నేపాలు సరిహద్దు మీద చైనా గావించిన దురాక్రమణ వివరాలు పత్రికలలో ప్రకటితమైనవి. ఈ వివరాల ప్రకారము చైనా సైన్యము నేపాలు టిబెట్టు సరిహద్దుమీద ఇరువదికిలోమీటర్ల పరిధిలోనికి చొచ్చుకొనిపోయి సైనిక చర్యలను గావించినది. ఈ చర్యలలో ఒక నేపాలు పౌరుడు చంపబడినాడు; మరికొందరు ఖైదీలుగా తీసికొనిపోబడినారు. వారుగాక, యిందొక యిద్దరు గ్రామాధికారులను బంధించి, పదునేడు గుర్రాలను స్వాధీనము గావించుకొని చైనా సైనికులు తీసికొని పోయినారు. పొరుగు రాజ్యాల పొలిమేరలలోపల ప్రవేశించి, హత్యాకాండను కావించి, చైనా సైన్యాలు గావించిన యీ విశృంఖల విహారము చైనా దురహంకారానికి, తన సైనిక శక్తిమీద ఆధారపడిన గర్వమునకు, పొరుగు దేశాల ప్రాంతాలను కబళించివేయుటకు జంకని దుస్సాహసమునకు నిదర్శనములై యున్నవి.

ఈ వివరాల నన్నింటిని నేపాలు యెగువ సభలో హోంశాఖామంత్రి వెల్లడి చేసియున్నారు. ఈ విషయమై చైనా ప్రభుత్వానికి తీవ్రమైన ఆక్షేపణనుగూడ నేపాలు ప్రభుత్వము తెలియజేసినది. కాని చైనా వైఖరి తెలిసినవారికి యీ ఆక్షేపణల వలన కలుగు ప్రయోజనము శూన్యమను సత్యమును వివరించి చెప్పవలసిన ఆవశ్యకత యేమాత్రమును లేదు. నేపాలు ప్రభుత్వము పంపిన ఆక్షేపణ లేఖలో యీ సంఘటన తీవ్రముగా గర్హింపబడినది. అంతర్జాతీయ న్యాయ సూత్రములను చైనా సైన్యములు ఉల్లంఘించినవని యిందులో ఉద్ఘాటింపబడినది. ఇటువంటి ఉల్లంఘనలు గావించుట చైనా ప్రభుత్వానికి ఒక అలవాటైపోయినది. ఇటీవలనే జరిగిన చైనా-నేపాలు ఒడంబడికకుగూడ చైనా సైన్యాలు గావించిన ప్రస్తుత దురాక్రమణ చర్య వ్యతిరేకముగానున్నదని యీ ఆక్షేపణ లేఖలో నొక్కి చెప్పబడినది. పరిస్థితి ప్రమాదకరముగానున్నదని నేపాలు హోం మంత్రి తన ప్రకటనలో వివరించియున్నారు. పరిస్థితిని సమీక్షించుకొనుటకు తత్క్షణమే నేపాలు మంత్రివర్గముయొక్క అసాధారణ సమావేశముగూడ జరిగినది.

నేపాలు ప్రభుత్వ ఆక్షేపణ లేఖకు చైనా యిచ్చిన సమాధానములోని వివరాలుగూడ ప్రకటితమైనవి. ఈ సమాధానము మిక్కిలి హాస్యాస్పదముగానున్నది. టిబెటులోని తిరుగుబాటును అణచివేయుటకు నేపాలు సరిహద్దులోనికి చైనా సైన్యాలు చొచ్చుకొని పోవుట జరిగినట్లు యీ సమాధానములో చైనా అంగీకరించినది. టిబెటులో చైనా చర్యలు అంతర్జాతీయ న్యాయసూత్రాలకు భంగకరములైనట్లు యిటీవలనే అంతర్జాతీయ న్యాయవేత్తల సంఘము తన నివేదికలో తెలియజేసినది. టిబెటులో చైనా చర్యలు తీవ్ర ఆక్షేపణకు గురియైనవి. భారీయెత్తున టిబెటు దేశీయులను చంపివేయుట జరుగుచున్నదనికూడ వార్తలు తెలుపుచున్నవి. తాను సాయుధులైన సైనికులను టిబెటులో ఉపయోగించుచున్నట్లు చైనా స్వయముగా ఒప్పుకొనినది; ఈ పరిస్థితిలో టిబెటులో తిరుగుబాటుదారులను అణచివేయుటకు తమ సైన్యాలు పొరుగుదేశమైన నేపాలు సరిహద్దులోనికి చొచ్చుకొని వచ్చుట ఆవశ్యకమైనదని జంకుగొంకులులేక చైనా ప్రకటించుట చైనా మనస్తత్వానికి, ఉద్దేశాలకు మంచి తార్కాణము. భారతదేశములోని చైనా అభిమానులు యిప్పటికైనను చైనా సత్యస్వరూపము గుర్తించుట అవసరము. చైనా చర్యలు ఆసియా దేశాల సమైక్యతకు, ప్రపంచశాంతికి ఉపద్రవకరముగానున్న సత్యమును గుర్తించి, జాగ్రత్తతోనుండవలసిన ఆవశ్యకత కలదు.

కుజగ్రహానికి రాకెట్

ఈ నెలలో పంపించబడునని డా॥ బాజికిన్

మాస్కో, జులై 1

ఈ సంవత్సరంలో రాకెట్‌నుపంపుటకు కుజగ్రహం అనుకూల పరిస్థితిలో నున్నదని మాస్కో ఖగోళ పరిశీలనశాల డైరెక్టర్ డా॥ విక్టర్ బాజికిన్ పత్రికా ప్రతినిధులతో అన్నారు. జులై నెలలో పసిఫిక్ మహాసముద్రం పైన శక్తిమంతమైన అంచలవారీ రాకెట్లను ప్రయోగించే విషయమై రష్యా సన్నాహాలు చేస్తున్నదనిఆయన పత్రికా ప్రతినిధులతో అన్నారు. చంద్ర మండలానికి ఇదివరకే రాకెట్‌ను పంపించిన సోవియట్ శాస్త్రజ్ఞులు ఈ సారి కుజ, శుక్ర గ్రహాలపైకి రాకెట్లను పంపుటకు తహతహపడుతున్నారన్నారు.

"ప్రస్తుతానికి నిరాయుధీకరణ సమస్యను యూనోకు అంటకట్టవద్దు"

-- దాగ్ హామర్‌షెల్డ్

న్యూయార్క్, జులై 1

ఐక్యరాజ్య సమితి కార్యదర్శి ప్రధాని దాగ్ హామర్షెల్డు ఒక ప్రకటనచేస్తూ నిరాయుధీకరణ సమస్యను ప్రస్తుతానికి ఐక్యరాజ్య సమితికి ముడిపెట్టవలదన్నాడు.

సోమవారం నాడు జెనీవా నిరాయుధీకరణ చర్చలు విఫలమైనపిమ్మట యూనో ప్రధాన కార్యదర్శి దాగ్ మొదటిసారి విలేఖరుల గోష్ఠిలో మాట్లాడుతూ ఐక్యరాజ్య సమితి నిరాయుధీకరణ కమిషన్ తొందరపడి సమావేశమైనంత మాత్రాన కలిగేలాభం ఏమీ ఉండదన్నాడు. యూనో నిరాయుధీకరణ కమిషన్‌లో 82 దేశాలున్నాయి. జెనీవా చర్చల వైఫల్యం తరువాత-ఆ సంఘటనతో కొంత దుమారం చెలరేగిందనీ ఆ వాతావరణం కొంత చల్లబడే వరకూ తిరిగి ఆ ప్రయత్నం చేయడం అంత ప్రయోజనకరంకాదని దాగ్ అన్నాడు. గతంలో జరిగిన ప్రయత్నాలు ఆధారంగా యూనో నిరాయుధీకరణ కమిషన్ కూడా ఏమీ ప్రయోజనం సాధించలేక ప్రతిష్టంభనకే గురిఅయ్యేట్లయితే దానివల్ల యూనోకుగాని నిరాయుధీకరణ సమస్యకుగాని ఏ దేశానికిగాని ఎట్టి లాభమూ ఉండబోదని కూడా దాగ్ స్పష్టం చేశాడు.

రష్యా ప్రతిపాదనలు

నెహ్రూ మద్దతునకు దాగ్ అనుకూల్యం

విదేశీ స్థావరాల్ని రద్దుపరచాలనీ అణ్వస్త్రాలను అందజేసే పద్ధతుల్ని విరమింపజేయాలనీ కల రష్యా నిరాయుధీకరణ ప్రతిపాదనలను అమలుపరచడం అవసరమన్న భారత ప్రధాని నెహ్రూ ప్రకటనను దాగ్ హామర్షెల్డు నేడు బలపరిచాడు. ఈ ప్రతిపాదనలు సాధారణ నిరాయుధీకరణ విధానానికి ముఖ్యమైనవని కూడా హామర్షెల్డు అన్నాడు. రష్యా పతిపాదనలు ప్రగతి పూర్వకమైనవనీ మునుపు యీ విషయంలో తానన్న అభిప్రాయానికే ఇప్పుడూ కట్టుబడి ఉంటాననీ దాగ్ పేర్కొన్నాడు.

నెహ్రూ ప్రకటనను దాగ్ బలపరచడం కేవలం తాను తటస్థంగా ఉండాలనుకోడం వల్లనేనని ఇక్కడ అభిజ్ఞులు భావిస్తున్నారు.

నేషనల్ ఫైర్ సర్వీసు కళాశాల సబాఫీసర్ల తరగతి పరీక్షా ఫలితాలు

న్యూఢిల్లీ, జులై 1

నాగపూర్‌లోని నేషనల్ ఫైర్ సర్వీసు కళాశాలకు చెందిన 89 మంది శిక్షణార్థులు 8 వ సబాఫీసర్ల తరగతిలో ఉత్తీర్ణులైనారు. ఉత్తీర్ణులైన వారిలో యీ క్రింది వారు కూడా వున్నారు:

ఎ ఎల్. నరసింహం (డిటెన్షన్). జి.వి సుబ్బారావు (ఆనర్సు), ఎమ్. కె. రావు (పాస్) అగ్నినిర్వాపణ, అగ్నిప్రమాదాల నివారణలో శిక్షణ ఇచ్చేనిమిత్తం 1956 జూలైలో కేంద్ర దేశీయాంగ మంత్రిత్వశాఖ నేషనల్ ఫైర్ సర్వీసు కళాశాలను ప్రారంభించింది.

సోవియట్ నాయకులతో మురార్జీ చర్చలు

తృతీయ ప్రణాళికకు ఇతోధిక సహాయాన్ని ఇంకాఅర్థించలేదట

మాస్కో, జూలై 1

భారతార్థికమంత్రి శ్రీ మురార్జీ దేశాయి సోవియట్ నాయకులతో చర్చలుమగించుకొని గతరాత్రి లెనిన్ గ్రాడ్‌కు బయలుదేరి వెళ్ళారు.

శ్రీ మురార్జీదేశాయి రష్యాప్రధాని నికిటా కృశ్చేవ్, ఉపప్రధాని కోసిగిన్, విదేశ ఆర్థిక సంబంధాల కమిటి అధ్యక్షుడు స్కచ్‌కోవ్, ఆర్థికమంత్రి గుర్‌టజోవ్‌లతో చర్చలు జరిపారు.

మురార్జీ తిరిగివచ్చేవారం మాస్కో నస్తారు. అప్పుడాయన ప్రథమ డిప్యూటీ ప్రధాని అనస్టాస్ మికోయాన్‌తో చర్చలు జరుపుతారు. ఈలోగా నిన్న మికోయాన్ విలేఖరులతో మాట్లాడుతూ భారత తృతీయ ప్రణాళికకు ఇతోధిక రష్యా సహాయాన్ని గురించి తమ ముందుకేమీ అభ్యర్థన రాలేదనీ ఆవిషయం చర్చింపబడలేదనీ చెప్పాడు.

టైప్‌రైటింగ్ పరీక్షా ఫలితాలు

హైద్రాబాద్, జులై 1

రాష్ట్రప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ నిర్వహించిన టైప్‌రైటింగ్ (ఇంగ్లీషు, తెలుగు) వ్రాత పరీక్షల ఫలితాలు దిగువ ఇస్తున్నాం. ఈ నంబర్లవారు తమ తమ కేంద్రాల్లోనే జులై 20 నుండి 23 వరకు జరిగే మౌఖిక ప్రాక్టికల్ పరీక్షలకు హాజరుకావాలి.

టైప్‌రైటింగ్ - ఇంగ్లీషు- లోయర్ గ్రేడ్

మచిలీపట్నం: 1964 70 71 72 79 81 2000 7 17 18 19 21 34 40 43 47 50 58 61 62 64 65 72 73 81 82 85 90 93 2101 4 5 7 9 13 14 20 23 28 33 35 36 37 38 44 45 47 49 50 51 55 56 73 78 80 2203 5 6 9 43 52 53 54 59 60 61 64 69 88. విజయవాడ: 2421 34 37 38 39 42 43 44 46 48 50 51 55 63 71 73 77 78 81 82 83 84 88 90 2501 2 9 10 11 12 25 31 44 48 49 55 59 60 61 63 64 66 67 68 71 74 75 2606 11 15 19 31 33 39 57 76 77 82 83 85 96 98 99 2708 9 11 14 15 16 17 18 19 20 21 22 27 28 29 30 36 38 39 41 42 43 46 50 54 56 58 59 62 63 2808 12 13 14 17 18 19 20 21 22 23 24 28 35 36 39 40. గుంటూరు: 3434 46 54 56 63 69 71 75 93 95 3518 20 24 44 50 51 53 54 62 63 65 67 69 70 73 80 81 83 84 85 86 88 3611 17 21 36 40 43 44 47 48 50 51 55 57 58 59 60 83 85 87 88 89 3701 28 29 30 33 36 44 48 55 57 61 68 75 79 81 84 86 88 90 92 3800 3 14 తెనాలి: 3126 27 29 33 34 36 41 44 50 51 52 62 63 74 77 3201 21 54 61 62 66 67 68 70 3321 23 24 28 30 37 58 63 93 3411 18 23. బాపట్ల: 4033 34 35 43 47 48 49 69 71 79 84 85 4109 11 12 14 23 24 25 28 30 49 51 52 62 64 65 66 78 80 81. ఒంగోలు: 4206 7 14 15 22 29 46 48 51. కర్నూలు: 4504 6 16 17 38 39 50 60 61 62 68 71 76 90 91 92 93 98 4612 41 50 58 అనంతపూర్: 4723 32 38 45 48 49 74 76 91 4826 30 32 33 33 39 40 50 62 64 65 66 67 78 80. కడప: 4943 55 56 60 67 69 75 78 79 91 5000 1 7 9 10 17 18 21 24 43 44 49 62 65 66 68 69 70 72 5929.

హైద్రాబాద్: 5335 40 43 47 50 52 54 56 57 63 64 65 68 73 74 79 5421.

ఇంగ్లీషు- హయ్యర్ గ్రేడ్

మచిలీపట్నం: 2023 24 68 97 99 2132 59 60 2222 27 30 73 76 77 5861.

విజయవాడ: 2462 2516 78 79 81 82 83 84 85 94 2642 45 58 64 91 2774 76 82 84 85 86 97 2830 42 43 82 గుంటూరు: 3460 3535 45 3600 34 63 97 3716 21 5882 85 తెనాలి: 3190 93 3205 16 23 25 27 30 75 77 78 79 80 3347 54 80 3407 22 5879. బాపట్ల: 4142 47 82. ఒంగోలు: 4234 36 42 63. కర్నూలు: 4604 5 35. అనంతపూర్: 4754 99 4845 46 47 73 74 5922. కడప: 4985 99 5052 71 85 86 91 5934 హైద్రాబాద్: 5381 83 86 89 93 94 95 5400 84.

తెలుగు టైప్‌రైటింగ్-లోయరు

మచిలీపట్నం: 2028 2134 35 2285. విజయవాడ: 2559 60 88 89 2719 21 25 84 88 90 91 92. హైద్రాబాద్: 5401.

హయ్యరు గ్రేడు

మచిలీపట్నం: 2133 63 2230. విజయవాడ: 2544 81 2720 86.

త్వరలో హైద్రాబాదులో 'నాట్య విద్యాలయం'

కూచిపూడి నృత్యంలోను, నాటక కళలోను శిక్షణ గరపగల కళాశాల ఏర్పాటు

హైద్రాబాద్, జులై 1

కూచిపూడి నృత్యంలోను, నాటక కళలోను శిక్షణ ఇచ్చే నాట్య విద్యాలయం ఒకటి హైదరాబాదులో త్వరలో ప్రారంభింపబడనున్నట్లు తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ నాట్య సంఘంవారు నాట్య విద్యాసమితిఅను ప్రత్యేక సంస్థను ఏర్పాటుచేసి రిజిస్టర్ చేయబోతున్నారు. ఆనాట్య విద్యాసమితిఆధ్వర్యాన నాట్యవిద్యాలయం ఏర్పాటవుతుంది; దానిలో కూచిపూడి నృత్య కళాశాల, నాటక కళాశాలఅను రెండు విభాగాలుంటాయి. నాటక కళలో ఏడాదికోర్సు, నృత్యకళలో ఆరేండ్ల కోర్సు ఉంటుందని తెలుస్తున్నది. నిర్ణీత పాఠ్యక్రమాలతో పూర్తి కళాశాలల పద్ధతిని నిర్వహింపబడగల యీనాట్య విద్యాలయం ఆగస్టు 15 నుండి ప్రారంభం కాగలదని భావించబడుతున్నది.

హైద్రాబాద్ నాట్య సంఘంవారు గత యేడాది నిర్వహించిన నాట్య విద్యాలయ పాఠశాల యీ కొత్తసంస్థలో సంలీనం కాగలదని కూడా తెలుస్తున్నది.

రాష్ట్ర రాజధానిలో నిజమైన "కళాశాల" లేని లోటును తీర్చడానికిగాను జరుగుతున్న యీకృషికి ఆంధ్రప్రదేశ్ సంగీతనాటక అకాడమీ సహాయం, రాష్ట్రప్రభుత్వ సాంకేతిక విద్యాశాఖ సహాయము కూడా ఉండగలవని తెలుస్తున్నది.

నాట్య విద్యాలయం ఏర్పాటునకు ఈదిగువ ఐదుగురు ప్రధానముగాకృషి చేస్తూ ఒక సమితిగా ఏర్పడ్డారు:

శ్రీయుతులు సి.వి ఆర్. కె ప్రసాద్, మామిడిపూడి ఆనందం,నటరాజరామకృష్ణ, పి.ఎస్.ఆర్. అప్పారావు, ఎ. ఆర్. కృష్ణ.

నాట్య విద్యాసమితి త్వరలోనే రిజిస్టరై ఎన్నికలు జరిగి ఒక స్వతంత్ర వ్యవస్థగా వ్యవహరించగలదు.

(మా.వి)

పశ్చిమ బెర్లిన్‌లో సేనల రిక్రూట్మెంటు

పశ్చిమ అగ్రరాజ్యతయానికి రష్యా ఆక్షేపణ పత్రాలు

మాస్కో, జులై 1

పశ్చిమ బెర్లిన్‌లో ఫెడరల్ సాయుధ దళాలకోసం పశ్చిమ జర్మనీ ప్రభుత్వం రిక్రూట్ మెంటు సాగిస్తున్నట్లు పాశ్చాత్య అగ్రరాజ్యత్రయం దృష్టికితెస్తూ నిన్న రష్యా ప్రభుత్వం ఆరాజ్యాల రాయబారులకు ఒకనోట్ అందజేసింది.

ఆనోట్‌లో యీ వ్యవహారంపై రష్యా ఏమిచేయదలిచినదీ పేర్కొనబడలేదట కూడా. నిన్నసాయంత్రం రష్యా విదేశాంగశాఖ కార్యాలయములో ఉపవిదేశాంగ మంత్రి నికొలాయ్‌ఫెరుబిన్ ఆపత్రాలను విడివిడిగా ముగ్గురు రాయబారులకు అందజేశారు.

ప్రస్తుతం పశ్చిమ బెర్లిన్‌లో పరిస్థితులకు మూడు పాశ్చాత్య అగ్రరాజ్యాలూ బాధ్యతవహిస్తున్నాయి కనుక యీ పత్రాలు ఆప్రభుత్వాలకు అందజేయబడ్డాయని తెలుస్తున్నది.

ఆంధ్రప్రదేశ్ ముస్లింలీగ్

నూతనముగా కార్యవర్గం ఏర్పాటు

హైద్రాబాద్, జులై 1

ఆంధ్రప్రదేశ్ ముస్లింలీగ్ ఆర్గనైజింగ్ కమిటీ అధ్యక్షుడుగా శ్రీ మౌలానా సయ్యద్ పాదూరుల్లా హుసేనీ యిఫ్తెకారీని, ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ అధ్యక్షుడు శ్రీ మహమ్మద్ ఇస్మాయిల్ నామినేట్ చేశారు.

ఇంకా ఈ దిగువవారు నామినేట్ చేయబడినారు:- శ్రీ అమీర్ అలీఖాన్ (రిటైర్డు సూబేదార్) ఉపాధ్యక్షుడు; మౌల్వీ హాజీ అబ్దుల్ లతీఫ్‌ఖాన్, ఉపాధ్యక్షుడు, శ్రీ యుతులు సయ్యద్ హసీఫ్ అలీ, సయ్యద్ అహమద్ అల్వీలు సంయుక్త కార్యదర్శులు, సయ్యద్ హసన్, ఖైజర్. అబ్దుల్ ఫైజ్ మిర్జా మహమ్మదలీ బేగ్, సయ్యద్ మహమూద్ హుసేన్, ఎస్. ఎస్. హుసేనీ. టి. టి. మహమ్మద్, సర్దార్ అలీఖాన్, హాజీ బుజ్జమాన్ ఖాన్, ఖాజా మొయినొద్దీన్, అల్ హాజ్ మహమ్మద్ తురాబ్, మౌలానా హాకీం అసదుద్దీన్, సయ్యద్ జఫరుల్లా జాఫరీ, మహమ్మద్ హుసేన్ ఫారూఖ, టి. అబ్దుల్‌రహమాన్, కె. ఎస్. ముస్తఫా అలీఖాన్, డా॥గియాఖొద్దీన్ అలీఖాన్ సభ్యులు.

ములుగుకు మంచినీటి పథకం

శ్రద్ధవహిస్తానని మంత్రి శ్రీ పి. రంగారెడ్డి హామీ

ములుగు, జూలై 1

ములుగు పంచాయితీ బోర్డుపక్షాన ప్రణాళికల మంత్రి శ్రీ పిడతల రంగారెడ్డికి గత 26 వ తేదీ సాయంత్రం ములుగు కమ్యూనిటి హాలులో సన్మానం జరిగింది.

సన్మాన పత్రాన్ని బోర్డు అధ్యక్షులు చదివారు.

ములుగు ప్రజలకు మంచినీటి ఎద్దడి కలదనీ కాబట్టి ఆ లోటును తీర్చటానికి మంచినీటి స్కీము ను ఇచటప్రారంభించాలనీ సన్మానపత్రంలో కోరబడింది. మంత్రి సమాధానం ఇస్తూ అలాంటి స్కీము ఏదైనా ఈ గ్రామానికి వున్నట్లయితే తప్పకుండా శ్రద్ధవహిస్తానన్నారు.

ఈ మంచినీటి సరఫరా విషయంలో గత రెండు సంవత్సరాల నుండి ప్రభుత్వ స్థాయిలో పరిశీలనలు జరుగుచున్నవి. సాంకేతిక నిపుణులు వచ్చి పరిశీలనలు జరిపి, విశాలమైన జావినినిర్మించి దానినుండి గ్రామానికి నల్లాలద్వారా మంచినీటి సరఫరా చేయవచ్చునని తెల్పారు. ఇదిగాక కొద్ది దూరంలో వున్న రామప్ప సరస్సునుండి నీటి సరఫరా కావాలంటే లక్షలాది డబ్బు కావలసి వస్తుందని, దానికంటె ఈ పథకమే బాగుందని తెలిసినటుల అభిజ్ఞవర్గాలంటున్నాయి. (మా.వి.)

ఆక్రాలో మీనన్ సన్మాన సభ

ఆక్రా, జులై 1

ఘానాలో నివసిస్తూన్న భారతీయులు ఘానా ప్రజలతో ఇతోధిక సౌహార్దాన్ని నెరపవలసిందిగా భారత రక్షణమంత్రి శ్రీ వి. కె. కృష్ణమీనన్ అన్నారు.

నిన్న ఆయన గౌరవార్థం ఒక అల్పాహార విందు జరిగింది. ఈ సందర్భంగా ఆయన భారతదేశ ఆర్థిక ప్రగతిని సమీక్షించారు.

ఈ సమావేశానికి దాదాపు 200 మంది భారతీయులు హాజరయ్యారు.

ఆక్రాలో ఉన్న 500 మంది భారతీయుల్లో ఎక్కువమంది వ్యాపారస్తులే. పదిమంది డాక్టర్లు ఇద్దరు యునో అధికారులు కూడా ఇక్కడి భారతీయుల్లో ఉన్నారు.

కేరళ గవర్నర్‌గా శ్రీగిరి ప్రమాణ స్వీకారం

త్రివేంద్రం, జులై 1

కేరళ సచివాలయ భవనంలోని దర్బారు హాలులో యీ ఉదయం జరిగిన నిరాడంబర ఉత్సవంలో శ్రీ వి.వి. గిరి కేరళ గవర్నరుగా ప్రమాణాన్ని స్వీకరించారు. కేరళ ప్రధాన న్యాయమూర్తి ఆయనచే ప్రమాణాన్ని స్వీకరింప జేశారు.

పిమ్మట కేరళ ముఖ్యమంత్రి శ్రీ పట్టంతాను పిళ్ళై కేరళ శాసన సభ స్పీకరును తన మంత్రివర్గ సభ్యులను గవర్నర్ శ్రీ వి.వి. గిరికి పరిచయం చేశారు.

శ్రీ గిరికి కేరళ పోలీసు దళం గౌరవ వందనం సమర్పించింది.

వనపర్తిలో విద్యార్థి పిడ్కోలు సభ

హెచ్. ఎస్. సి-లో సర్వప్రథమ గణ్యతపొందిన శ్రీనరసింహాచారి

వనపర్తి, జులై 1

గత మార్చి హెచ్. ఎస్. సి. పరీక్షలో ప్రప్రథమముగా ఉత్తీర్ణులైన విద్యార్థి శ్రీ ఎ. నరసింహాచారి గౌరవార్థము పాఠశాల పక్షమున జూన్ 27వ తేదీన పిడ్కోలు సమావేశము జరిగెను. ఈ సమావేశములో ఉన్నతోద్యోగులు పురప్రముఖులు కూడ పాల్గొనిరి. ప్రొఫెసర్ శ్రీ హాఫీజుల్లా (ప్రిన్సిపాల్ కృష్ణదేవరాయ పాలిటెక్నిక్) అధ్యక్షత వహించిరి. ఎం. ఏ. సమద్ (ప్రధానోపాధ్యాయులు) స్వాగత మొసంగుచు శ్రీ నరసింహాచారిని పరిచయముచేసి ఆశీర్వదించిరి. వనపర్తి తాలూకా సమితి అధ్యక్షులు జగన్నాథరెడ్డి ఆ విద్యార్థి సాధించిన ఘనవిజయమును అభినందించుచు ఈ విజయము కేవలము వనపర్తికి చెందినదేకాక మొత్తము తెలంగాణా ప్రాంతమునకు చెందినదనిరి. సభాధ్యక్షులు స్థానిక తహసీల్‌దార్ కొందరు పురప్రముఖులు, విద్యార్థి ప్రతినిధులు శ్రీనరసింహాచారికి బహుమానములుసమర్పించి ప్రోత్సహించిరి. మహాబూబ్‌నగర్ జిల్లా పరిషత్తుఅధ్యక్షులు శ్రీ కె. రామచంద్రారెడ్డి (ఎం-ఎల్-సి) మొదలగువారు పంపిన సందేశములు వినిపింపబడెను. హైస్కూల్ తెలుగుపండితులు శ్రీజి చంద్రమౌళిశర్మ, విద్వాన్ వీరభద్రయ్య విద్యార్థి నాశీర్వదించుచు వ్రాసిన పద్యాలు చదువబడెను. జాతీయగీత పఠనముతో సభ ముగింపబడెను. తర్వాత విద్యార్థులందరు శ్రీ ఎ. నరసింహాచారిని ఊరేగించిరి.

(ప్ర-వి)

మునుపు హిట్లర్ ఉన్న హోటల్లో కృశ్చేవ్ బస

ఆస్ట్రియాలో రష్యా ప్రధానికి గొప్ప స్వాగతం జరుగలేదట

వియన్నా, జులై 1

శాంతియుత సహజీవనానికే రష్యా కట్టుబడి ఉందని నిన్న ఇక్కడికి చేరిన రష్యాప్రధాని నికిటా కృశ్చేవ్ ప్రకటించాడు.

ప్యారిస్ చర్చల వైఫల్యం అనంతరము కృశ్చేవ్ కమ్యూనిస్టేతర రాజ్యాలకు పర్యటనకురావడం ఇదే ప్రథమం. ఇక్కడ కృశ్చేవ్‌కు ఏమాత్రం హార్దికమైన స్వాగతం లభించలేదని పరిశీలకులు అంటున్నారు. కృశ్చేవ్‌వస్తే విమానాశ్రయానికి ఎక్కువమంది కూడా రాలేదట. ఎక్కువగా పతాకాలైనా ప్రదర్శించబడలేదట. కృశ్చేవ్‌విమానం దిగుతుంటే ఎవ్వరూ హర్షధ్వానాలుకూడా చేయలేదని చెబుతున్నారు. కమ్యూనిస్టు రాయబారులు వారి కుటుంబాలవారు మాత్రం హర్షధ్వనులుచేశారట.

ఆస్ట్రియా రాజధానిలో కృశ్చేవ్ ప్రయాణంచేసిన రూటులో పోలీసు బందోబస్తు బాగా జరుపబడింది. ఆస్ట్రియాలో హంగేరీ శరణార్థులు చాలా మంది ఉన్నారు. అయినా ఎట్టి సంఘటనా జరుగలేదు. మునుపు హిట్లర్ ఉన్న హోటల్ లో ఇప్పుడు కృశ్చేవ్ బసచేశాడు.

మాస్కోనుండి డా॥ప్రసాద్ ప్రయాణం

మాస్కో, జులై 1

రష్యాల

3 వ మహత్తరవారం

పద్మశ్రీ వారి

"శ్రీ వెంకటేశ్వర మాహాత్మ్యం"

ఎన్. టి. రామారావు, సావిత్రి.

జగత్ టాకీస్

సైదాబాద్, హైద్రాబాదు.

ఆటలు; 3-00, 6-15, 9-30 గం॥

(Nima)

నేడే చూడండి !

మోడరన్ థియేటర్స్:

'సహస్ర శిరచ్ఛేద అపూర్వ చింతామణి'

తా: దేవిక, గిరిజ, కాంతారావు, గుమ్మడి.

నూర్ మహల్

అంబరుపేట

ఆటలు ; 3-15, 6-15, 9-30.

(Nima)

నేడే చూడండి! :

వీనస్ పిక్చర్స్:

పెళ్లికానుక

నాగేశ్వరరావు, వి. సరోజాదేవి, కృష్ణకుమారి, రేలంగి.

13 వ వారము

రీగల్

హైద్రాబాద్.

ఆటలు: 2-00, 5-45, 9-30 గం॥

(Nima)

ఆళ్ళగడ్డ టి.సి.సి. ఎన్నికలు

జులైలో జరుపడానికి నిర్ణయం

(మా.వి)

ఆళ్ళగడ్డ, జులై 1

ఆళ్ళగడ్డ తాలూకా కాంగ్రెసు సంఘం కార్యవర్గసభ్యులు అత్యవసరముగా డాక్టర్ వి. పుల్లారెడ్డి అధ్యక్షతన సమావేశమై తాలూకా కాంగ్రెసు సంఘం తరపున రైతుమహాసభజరుపుటకుతీర్మానించింది. తర్వాత మండల కాంగ్రెసు సంఘ సభ్యుల సమావేశము జరిపి నూతనతాలూకా కాంగ్రెసు సంఘఎన్నికలుజులై నెలలో జరుపుటకు తీర్మానించింది. తర్వాత విరివిగా కాంగ్రెసు సభ్యులను చేర్పించాలని కూడా సభ్యులు కోరారు.

పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీపుల్లారెడ్డి తన సమితి ప్రాంతంలో వ్యవసాయాభివృద్ధితో పాటు ప్రతి గ్రామంలో విద్యా, వైద్యాభివృద్ధి జరిగేలాగున్నూ ప్రయత్నిస్తున్నట్లు వ్యక్తపరిచారు. ప్రతి గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవనముకూడానిర్మించాలని సూచించారు ప్రస్తుతము ఈ సంవత్సరము ఆళ్ళగడ్డ బేసిక్ ప్రాథమిక పాఠశాలను ప్రారంభించినట్లు కూడా చెప్పారు.

అంబర్ చరఖా కేంద్రాలు

ఆళ్ళగడ్డ తాలూకాలో అంబరు చరఖా కేంద్రాలను విరివిగా ప్రతి గ్రామంలో స్థాపించాలనే ఉద్దేశ్యంతో ప్రచారంచేసేందుకు చాగలమర్రిగ్రామ ఖాదీగ్రామోద్యోగీయ మేనేజరు శ్రీ వి. సి. సుబ్బారెడ్డి, తాలూకా కాంగ్రెసు సంఘ ప్రధాన కార్యదర్శి శ్రీ ఆర్. వి. శేషాద్రి తాలూకా పర్యటనచేస్తున్నారు. ఈసందర్భంలో గ్రామ ప్రజలు సహకరించాలని వారు కోరారు.

విద్యా విధానంపై విమర్శ

రుద్రవరం పంచాయతీ సమితిఅధ్యక్షులు శ్రీబి. తిమ్మారెడ్డిమాట్లాడుతూ "ప్రతి గ్రామపంచాయతీ అధ్యక్షులు, సభ్యులు ముతాతత్వంతోగాక, విశాల దృక్పథంతో గ్రామాభివృద్ధికి, నిపాణికంగా పాటుపడాలి మరియు ఉపాధ్యాయులు కూడా దేశాభిమానంతో తాము ఉద్యోగ కర్తవ్యాన్ని నెరవేర్చాలని కేవలం "సిలబసు" ప్రకారం పనిచేయరాదని, మరియు పెద్ద ఉద్యోగస్థుల నిర్లక్ష్యంవల్లనే విద్యా విధానం వినాశమైనదని" తెలిపారు.

హైద్రాబాదులో మాంటెస్సోరి శిక్షణ

జులై 15 నుండి ప్రారంభం

మద్రాసు, జులై 1

జులై 15, 1960 నుండి ఫిబ్రవరి 28, 1961 వరకు హైద్రాబాదులో జరుగు మాంటెస్సోరి శిక్షణను పొందుటకు మొత్తం భారతదేశంనుండి 150 మంది ఉపాధ్యాయులు రానున్నారని మాంటెస్సోరి అంతర్జాతీయ సంఘ భారతదేశ ప్రతినిధి శ్రీ ఏ. ఎస్. జాస్టైన్ నిన్న యిచట అన్నారు. మనదేశంలో ఇది 25 వ శిక్షణకోర్సు. మెథడిస్టు బాలుర పాఠశాలలో జరుపబడే ఈ శిక్షణకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రు. 10 వేలు మంజూరు చేసినది. ఇంతేకాకుండా నిజాం ట్రస్టు ఫండ్ వారు 25 స్కాలర్ షిప్పులను యిస్తున్నారన్నారు. అన్ని రాష్ట్ర ప్రభుత్వాల పరిగణన కున్న ఈ డిప్లొమా కోర్సుకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు 50 మంది ఉపాధ్యాయులను శిక్షణకై పంపుచున్నదని శ్రీ జాస్టైన్ అన్నారు.

విడిసమయము లో సినిమా రికార్డులు వేసినందుకు కేసు

ఒంగోలు, జులై 1

శ్రీ డి. యల్. యన్. సోమయాజులు (జుడీషియల్ సెకండ్ క్లాస్ మేజస్ట్రేట్, ఒంగోలు) నిర్ణీతకాలము నకుమించి అదనపు కాలమున సినిమా రికార్డులను ఒక స్థానిక సినిమాహాలు వారి వాహనముతో ప్రచారము నిమిత్తము ఉపయోగించినందుకు ఒంగోలు పట్టణ పోలీసువారు దాఖలు చేసిన కేసును మద్రాసు సిటీ పోలీసు చట్టము నం. 76 క్రింద త్రోసిపుచ్చిరి.

(మా.వి)

చౌటుప్పల్ పంచాయతీ సమితి సేవ

హైద్రాబాద్, జులై 1

చౌటుప్పల్‌లో జూన్ 26 న కొట్టుకపోయిన వస్తు సామగ్రిని పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ సి. ఆనంతరెడ్డి పోగుచేస్తున్నారు. వాటి యజమానులను కనుక్కున్న తరువాత వాటిని వారికొప్పచెప్పుట జరుగుచున్నది.

ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు కౌన్సిల్

హైద్రాబాద్, జులై 1

సేద్య యోగ్యమైన బంజర్లు భూములు లేనివారికి పంచబడునన్న ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ప్రకటన పట్ల తమ హర్షాన్ని తెలుపుతూ ప్రస్తుతం జరుగుచున్న బేదఖళ్లను ఆంధ్రప్రదేశ్ కమ్యూనిస్టు కౌన్సిల్ వారు ఖండించారు. ప్రజలు ఈ బేదఖళ్లను వ్యతిరేకించాలని గూడ కౌన్సిల్ కోరినది. బ్రిటిష్ కమ్యూనిస్టు పార్టీ స్థాపక సభ్యుడు శ్రీ హెరీపోలిట్ మరణం పట్ల తమ సంతాపాన్ని మరో తీర్మానంలో తెలిపారు.

అమెరికాలో విదేశ విద్యార్థులు

భారతదేశానికి తృతీయ స్థానం

న్యూయార్కు, జులై 1

1959-60 విద్యా సంవత్సరంలో అమెరికాలో విద్య నభ్యసించిన విదేశీయుల్లో భారతీయులు 3,772 మంది. అధిక సంఖ్యాకులుగా విద్యార్థులను అమెరికాకు పంపిన దేశాలలో భారత దేశానిది మూడవ స్థానం.

అంతర్జాతీయ విద్యా సంస్థ గడచిన సోమవారం చేసిన ప్రకటనలో 5,679 మంది విద్యార్థులను పంపిన కెనడా, 4,946 మంది విద్యార్థులను పంపిన చైనా తర్వాత మూడో స్థానం భారత దేశానిదేనని తెలియజేసింది. చైనా పంపించినట్లు నమోదు చేయబడిన విద్యార్థులలో తైవాన్, హాంగ్ కాంగ్, మకావో, కమ్యూనిస్టు చైనాకు చెందినవారు కూడా ఉన్నారు.

అమెరికన్ విద్యా సంస్థల్లోని మొత్తం విదేశీ విద్యార్థుల సంఖ్యలో భారతీయ విద్యార్థులది 7.8 శాతం ఉన్నది. గత సంవత్సరంకంటె 1959-60 విద్యా సంవత్సరంలో భారతీయ విద్యార్థుల సంఖ్య 574 అధికమయింది. క్రిందటేడాది కూడా విదేశీ విద్యార్థుల సంఖ్యలో భారతదేశానికి మూడవ స్థానం వచ్చింది.

గత సంవత్సరం అమెరికన్ పాఠశాలల్లో మొత్తం 48,468 మంది విదేశ విద్యార్థులున్నారు.

కెనడా, చైనా, ఇండియాల తర్వాత ఎక్కువ మంది విద్యార్థులను అమెరికాకు పంపించిన దేశాల వరస క్రమం ఇలా ఉన్నది: ఇరాన్, కొరియా, జపాన్, ఫిలిప్పీన్స్, మెక్సికో, వెనిజులా, గ్రీస్.

గుంతకల్లు సహకార నూలు మిల్లు

వ్యవహారాల పరిశీలనకు ప్రత్యేక బృందం?

గుంతకల్లు, జులై 1

ఢిల్లీనుండి బెంగుళూరు వెడుతున్న కేంద్ర ప్రణాళికలమంత్రి శ్రీ యస్. కె. డేను రాయలసీమ భారత్ సేవక్ సమాజ్ కార్యకర్తలు శ్రీ జి. ఆర్. లింగం, శ్రీ ఆర్. సుల్తానులు గుంతకల్లు పురప్రముఖులు శ్రీ రామచంద్ర గౌడు రైల్వేస్టేషన్‌లో కలుసుకొని, తృతీయ పంచవర్ష ప్రణాళిక రాయలసీమలో రైల్వేల అభివృద్ధి గుంతకల్లులోని ఆంధ్ర కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు వ్యవహారాలు మొదలగు అనేక విషయాలను గురించి దాదాపు రెండు గంటలపాటు చర్చించారు. అనంతపురం జిల్లాకలెక్టరు శ్రీ ఎస్. ఆర్. రామమూర్తి కూడా ఈ చర్చలలో పాల్గొన్నారు.

గుంతకల్లులోని ఆంధ్ర కో ఆపరేటివ్ స్పిన్నింగ్ మిల్లు వ్యవహారాలను సహకారోద్యమమును కార్మికపాత్రను గురించి శ్రీ ఆర్. సుల్తాను శ్రీ జి. ఆర్. లింగం విమర్శలను విన్నతర్వాత ఈమిల్లుకు భారతప్రధాని శ్రీ జవహరులాల్ నెహ్రూ శంకుస్థాపన చేసినట్లు తమకు బాగా గుర్తు వున్నదనీ దేశములో చేయబడిన ఈప్రథమప్రయత్న ఫలితము ఎలావుంటుందోనని కేంద్రం ఈ మిల్లును ప్రత్యేకముగా ఒక కంటకని పెట్టుతూ వున్నదనీ ఇంతవరకూ విన్న ఈమిల్లు వ్యవహారాలను పరిశీలించేందుకుగాను ప్రత్యేకముగా ఒక పరిశీలక బృందాన్ని పంపగలమనీ శ్రీ డే ప్రకటించారు.

గురుకుల విద్యా ప్రమాణాల పెంపుదల

కేంద్ర సంస్కృత బోర్డు సిఫార్సులు

న్యూఢిల్లీ, జులై 1

గురుకులాలయొక్క ప్రస్తుత స్థితిగతులనూ, అవసరాలనూ పరిశీలించాలని కేంద్ర సంస్కృతబోర్డు యిటీవలే నిర్ణయించినదనీ, కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఒక పత్రికాప్రకటనలో తెలియ చేసింది.

గురుకుల విద్యాసంస్థల ఆర్థిక పరిస్థితులూ, వాటికి సహాయపడడానికి తీసుకోదగు చర్యలూ, వాటిలోగల కోర్సులూ, పాఠ్య విషయాలూ, ఆ కోర్సులను ప్రమాణీకరించడానికి నెలకొల్పవలసిన ఏజెన్సీలు మొదలైనవి పరిశీలించబడతాయి.

ఇందుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించడానికి కేంద్ర విద్యా మంత్రిత్వశాఖ ఒక పట్టికను రూపొందించారు. అది కావలిసినవారు ఈ క్రింది చిరునామాకు వ్రాసి పొందవచ్చును. "స్పెషలు ఆఫీసరు, సంస్కృతం, కేంద్ర విద్యామంత్రిత్వశాఖ, న్యూఢిల్లీ".

23/4 శాతం ఋణం (1960) చెల్లింపు

న్యూఢిల్లీ, జూలై 1

23/4 శాతం ఋణం (1960) తాలూకు శేషాన్ని 1960 జూలై 15వ తేదిన చెల్లించి వేస్తారనీ ఇక ఆ తేదీ తర్వాతదానిపై వడ్డీ ఉండదనీ ఆర్థిక మంత్రిత్వశాఖ నేడొక పత్రికా ప్రకటనలో చెల్లడించింది.

నిర్ణీత దినాన సొమ్ము చెల్లించడానికి వీలుగా, తమ సెక్యూరిటీలను ప్రజలు 1960 జూలై 8వ తేదీన గాని, ఆ తర్వాతగానీ, ఆ సెక్యూరిటీలపై ముద్రవేసిన లేదా వాటిని నమోదు చేసిన ప్రభుత్వ ఋణ కార్యాలయం, ట్రెజరీ లేదా స్టేటు బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైద్రాబాద్ స్టేట్ బ్యాంకు, మైసూర్ స్టేట్ బ్యాంకుల బ్రాంచీలలో దేనిలోనైనాగాని అందజేయవచ్చును. పై కార్యాలయాలలో దేనిద్వారానైనా సొమ్ముచాపకుకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చును.

కొత్త తూనికలూ, కొలతలపై ముద్రలు

న్యూఢిల్లీ, జులై 1

వర్తక, పారిశ్రామిక రంగాలలో మెట్రిక్ పద్ధతి తూనికలనూ, కొలతలనూ అమలులోకితెస్తూ అన్నిరాష్ట్రాలలోనూ, కేంద్ర పాలిత ప్రాంతాలలోనూ శాసనాలు అమలులోకి వచ్చాయి. ఈశాసనాలకు సంబంధించిన ప్రధానాంశాలు సర్వేసర్వత్రా సమానముగా నేవున్నాయి. వ్యాపారానికి ఉపయోగించే అన్ని తూనికలనూ కొలతలనూ, తూనిక యంత్రాలనూ అప్పుడప్పుడు తనిఖీచేయించి, ముద్రలు వేయిస్తూవుండాలి. రాష్ట్రాలలోని ఇనస్పెక్టర్లు అప్పుడప్పుడువాటిని తనిఖీ చేస్తూ ముద్రలులేని తూనికలనూ, కొలతలనూ స్వాధీన పరుచుకోవచ్చు.

వాణిజ్య రంగంలో వాడని తూనికలకూ, కొలతలకూ యీనిబంధన వర్తించదు. వాటిపై ముద్రలు వేయపక్కరలేదు.

ఆదివారం కార్యక్రమం

హైదరాబాద్-ఎ

405.4 మీ (740 కిలోసై)

ఆదివారం జులై 3

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-40 భక్తి రంజని, 7-00 తె-వా, 7-15 "అమరవాణి" (విజయవాడనుండిరిలే) 7-30 పద్మావతీ గోఖలే 7-45 సంగీతశిక్షణ 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 ఇండియన్ మార్కెట్యూన్స్ 8-35 సుబద్ధసంగీత్ 8-45 పిల్లలకు కొత్త పాటలు 9-00 "బచ్చోంకేలియే" 9-30 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 చిత్రజగత్ 1-00 రంగవల్లి 1-30 ఆర్. రాధ, ఆర్. నాగలక్ష్మి 1-50 తె-వా, 2-00 రసూలన్‌బాయ్ బేగమ్‌అఖ్‌తార్ 2-10 ఉ-వా, 2-20 బాలవినోదం 3-00 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు, 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15 "నగరవాణి" 7-00 తె వా, 7-15 కన్నడశ్రోతలకు 7-30 నాటిక(ఉర్దూ) 8-00 చిత్రసీమ 8 30(ఢిల్లీనుండి రిలే) 8-45 సుగమ్ సంగీత్ 9-00 ఆం-వా, 9-15 ఉ-వా, 9-30 డి ఆర్. పార్వతీకర్: సితార్ 10-00 పద్మావతీగోఖలే 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

హైదరాబాదు-బి

42 02 మీ (7140 కిలోసై)

ఉ॥ 6-30 హైద్రాబాద్ ఎవలె, 8-15 పి. సోమేశ్వరరావు: వీణ 9-30 ప్రసారసమాప్తి.

30.86 మీ (9720 కిలోసై)

మ॥ 12-30 హైద్రాబాద్ ఎ వలె. 2-10 శాస్త్రీయ సంగీతము 2-20 హైదరాబాద్ ఎ వలె 3-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

60.12 మీ (4990 కిలోసై)

సా॥ 6-00 హైద్రాబాద్ ఎ వలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-00తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము, 7-30 పి. సోమేశ్వరరావు: వీణ 9-15 రాగ లక్షణము: మంజరి 9-30 హైద్రాబాద్ ఎ వలె, 10-30 వాతావరణసూచన, ప్రసారసమాప్తి.

విజయవాడ

357.1 మీ (840 కిలోసై)

ఉ॥ 6-30 శుభోదయం, ప్రసార విశేషాలు, దేశభక్తి గేయము 6-40 భక్తిరంజనిగణే: స్తోత్రం 7-00తె-వా, 7-15"అమరవాణి"సంస్కృతకార్యక్రమము ,మణిస్తభస్య దూరదృష్టిశక్తి: లఘుకథా 7-30 ఎ. ఐ. ఆర్. వాద్యబృందము 7-45 సంగీత శిక్షణ 8-00 ఆం-వా, 8-15 హిం-వా, 8-30 పాల వెలి, చిన్న పిల్లల కార్యక్రమము, పాపల్లారా రారండి, సోమరిసోము, సంగీత రూపకము, ఏనుగమ్మ ఏనుగు, జానపద గేయము, ఇకచాలు 9-00 ప్రసార సమాప్తి.

మ॥ 12-30 కోట రామకృష్ణయ్య: వయొలిన్ 1-00 లలిత సంగీతం 1-30 గాత్ర సంగీతం 1-50 తె-వా, 2-00 ప్రసార సమాప్తి.

3-00 వసంతసేన, నాటిక 4-00 ప్రసార సమాప్తి.

సా॥ 6-00 స్థానిక ప్రకటనలు 6-05 ప్రాంతీయ వార్తలు, 6-15గ్రామస్థుల కార్యక్రమము, 7-00 తె-వా, 7-15 గ్రామస్థుల కార్యక్రమము 7-30 డాక్యుమెంటరీ చిత్రాల సమీక్ష 7-40 లలిత సంగీతం: ఎస్. వి. గోవిందాచార్యులు 8-00 కోట రామకృష్ణయ్య: వయొలిన్ 8-30 (ఢిల్లీనుండిరిలే) 8-45 మధురమణిఅయ్యర్ 9-00 అం-వా, 9-15 లలిత సంగీత : ఎస్.వి. గోవిందాచార్యులు 9-30 టి ఆర్. సుబ్రహ్మణ్యం డి పాండురంగరాజు: వయొలిన్. జె. సింహాచలశాస్త్రిమృదంగం 10-30 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

జపాన్‌కు రష్యా హెచ్చరిక

మాస్కో, జులై 1

అమెరికా-జపాన్ సంధిని ధ్రువపరచుటవల్ల జపాన్ "హిరోషిమా, నాగసాకి"కంటె భీషణమైన ప్రమాదాన్ని ఆహ్వానిస్తున్నదని సోవియట్ యూనియన్ జపాన్‌కొక హెచ్చరికను ప్రకటిస్తూ, ఆ ఒప్పందాన్ని రద్దుపరచుటవల్ల జపాన్‌కు చాలా లాభాలు చేకూరగలవనికూడ తెలిపారు. ఆ ఒప్పందంవల్ల జపాన్ భూభాగం యు. ఎస్. విమానాశ్రయంగా పరిణమిల్లగలదనీ, తద్వారా జపానుగొప్ప విపత్తుకు గురికాగలదనీ టాస్ వార్తా సంస్థద్వారా వెల్లడైన ఆ ప్రకటనవల్ల తెలుస్తున్నది. అలా కాకుండా, ఒకవేళ ఆ ఒప్పందాన్ని రద్దుపరచిన జపానుకు వాస్తవ భద్రత యేర్పడుటయేగాక సోవియటు-జపాన్ సంబంధాలు బలపడి తద్వారా జపాన్ సమస్యల పరిష్కారం జరుగుతుందని ఆ ప్రకటనలో తెలుపబడినది

సినిమా పరిశ్రమ పునర్నిర్మాణం

డా॥ కేస్కర్ సలహా

మద్రాస్, జులై 1

"పవిధమైన పెట్టుబడి, శక్తి సామర్థ్యాలు లేకుండా సినీపరిశ్రమలో చేరరాదని పరిశ్రమలోని అవాంఛనీయ శక్తులను తొలగించి పరిశ్రమను పునర్నిర్మించవలసిందిగా" కేంద్రప్రభుత్వ సమాచార బ్రాడ్‌కాస్టింగ్ మంత్రి శ్రీ బి. వి. కేస్కర్ నిన్న సౌత్ ఇండియన్ ఫిలిం ఛాంబర్‌లో జరిగిన విందు సందర్భములో విజ్ఞప్తి చేశారు.

కొన్ని బలవత్తరమైన ముఠాలు పరిశ్రమలో విభేదాలు కల్పిస్తున్నవనీ ప్రత్యేక ప్రావీణ్యముగల వ్యక్తులను పరిశ్రమనుండి వేరుచేస్తున్నవనీ కనుకయిటువంటి స్పర్థలు రాకుండా వుండాలన్నారు. పరిశ్రమలోని ప్రముఖులు పరిశ్రమాభివృద్ధికై తగు సూచనలు ప్రభుత్వానికి యివ్వాలనీ అట్లు చేసేట్టయితే ప్రభుత్వము తగు సహాయాన్ని చేస్తుందని హామీ యిచ్చారు. తరువాత మంచి చిత్రాలనుకూడ నిర్మించాలని శ్రీ కేస్కర్ వాదించారు.

ఎక్సైజ్ డ్యూటి పన్నును ప్రస్తావిస్తూ "ఇది పరిశ్రమ పురోభివృద్ధికి గొడ్డలిపెట్టు అనీ, ఈ విషయాన్ని ఆర్థికమంత్రితో వివరముగా చర్చించి పరిశ్రమాభివృద్ధికై కృషి చేస్తాననీ" శ్రీ కేస్కర్ అన్నారు.

విదేశ పర్యటనను తగ్గించడము అనేది రాష్ట్రప్రభుత్వాలు చూడవలసినదేనని అయినప్పటికీ కొన్ని రాష్ట్రప్రభుత్వాలు పన్ను చేయడము మానివేశాయనీ, మరికొన్ని ప్రభుత్వాలకు మంచి ఆదాయము వస్తున్నది కనుక వారు యీపన్ను నిర్మూలనకు నిరాకరించారన్నారు పూనాలో ప్రభుత్వం ఫిలిం సంస్థను స్థాపించిందంటే, అచట సాధన సంపత్తి, అన్నిహంగులూ గల్గి సరసమైన ధరకు వచ్చింది కనుకనేననీ మరియొక కారణము ఏమీలేదనీ ఇది పరిశ్రమకు కావలసిన సాంకేతిక నిపుణులను తయారు చేయగలదనడంలో సందేహము లేదని శ్రీ కేస్కర్ అన్నారు.

ఫిలిం ఫైనాన్సు కార్పొరేషనుకు ప్రభుత్వము ధన సహాయము చేయగలదనీ, క్రమముగా కార్పొరేషను అభివృద్ధి చెందగలదనీ ఆశించారు.

"రాష్ట్రపతి చే బహూకరింపబడు ప్రభుత్వ బహుమతులను ఢిల్లీలో బదులుగా బొంబాయి, మద్రాసు, కలకత్తాలలో క్రమముగా ఏర్పాటు చేయవలెననీ దీనివలన ప్రాంతీయ పరిశ్రమలలో పనిచేయు అందరు సభ్యులకు ఈ ఉత్సవాలను తిలకించుటకు అవకాశము కలదనీ" శ్రీ ఎ. యల్. శ్రీనివాసన్, ఛేంబర్ అధ్యక్షుడు తన ప్రారంభోపన్యాసములో అన్నారు.

మరియు ఎక్సైజ్ డ్యూటి విధించడమువల్ల సినిమాలు దెబ్బతినడమే గాక, ప్రభుత్వాదాయానికికూడ భంగము వాటిల్లకలదనికూడ శ్రీ శ్రీనివాసన్ అన్నారు.

6 వ సంయుక్త వారం

కమాల్ అమ్రోహిస్

దిల్ అప్నా ఔర్ ప్రీత్ పరాయి



తా॥ మీనాకుమారి, రాజ్‌కుమార్, ఓంప్రకాష్, నాదిరా, పమ్మి.

దర్శకత్వం:- కిషోర్ సాహు.

సంగీతం:- శంకర్ జైకిషన్.

రాయల్

హైద్రాబాద్.

మిసర్వా

సికింద్రాబాద్.

నేడు 3 ఆటలు: 3-15, 6-15, 9-30

—శ్రీ సినీ కార్పొరేషన్ రిలీజ్.

(Trupix)

వేసవిలో చల్లదనానికి....

చేనేత వస్త్రాలు ధరించండి

మన తాత ముత్తాతలు కూడా వేసవిలో చల్లదనానికి చేనేత వస్త్రాలు ధరించేవారు. చందేరీ చీరెలు, మృదువైన పట్టీనులు, ఎన్నో రంగులలో తయారయే 'ముడికట్టు' వస్త్రాలు, డోరియాలు- ఎన్నో! అన్నీ చల్లదనాన్నిచ్చే వేసవి దుస్తులుగా ఉపయోగించవచ్చు.

సరసమైన ధరలకు శ్రేష్ఠమైన వస్త్రాలు

ఆల్ ఇండియా హాండ్‌లూమ్ బోర్డు

తపాలు సంచి నెం. 10004, బొంబాయి.

DA 60/200

నేటి రాత్రి నేటి రాత్రి

అలంకార్ చిత్రా సమర్పించు

సర్‌హద్

తా: దేవానంద్, సుచిత్రాసేన్, రాగిణి, అన్వర్, సజ్జన్,

జమ్‌ఖుద్ - హైద్రాబాద్.

శుక్ర, శని, ఆది 4 ఆటలు: 12-00, 3-00, 6-15, 9-45 గం॥

అశోక్ హైద్రాబాద్. స్వారథైజ్ (పర్‌కండిషన్‌డ్) సికింద్రాబాద్.

శుక్ర, శని, ఆది 3 ఆటలు: 3-00, 6-15, 9-45 గం॥

(Trupix) చిత్రకళాపిక్చర్స్ విడుదల.

నేటి రాత్రి నేటి రాత్రి

జంటనగరములలో అన్ని ఆటలు ప్రేక్షకులచే క్రిక్కిరిసి పోవుచున్నవి.

తిరుమల పిక్చర్స్ సమర్పించు

* సమాజం *

తా॥ రాజసులోచన, గిరిజ, జగ్గయ్య, రేలంగి, ఆర్. నాగేశ్వరరావు, నాగయ్య, గుమ్మడి, సి. ఎస్. ఆర్, పేకేటి, లక్ష్మి

దర్శకత్వం: ఆడ్డాల నారాయణరావు.

సంగీతం: అశ్వత్థామ.

సాగర్ హైద్రాబాదు.

రాజేశ్వర్ సికింద్రాబాదు.

ఆటలు: 2-00, 6-00 మరియు 9-45 గం॥

మరియు మార్కండేయ - వరంగల్.

(Trupix)

5 వ మహత్తరవారం

ఇంపైన సంగీతముతో కుటుంబములకు అత్యుత్తమ వినోద చిత్రము

తా: రమణమూర్తి, చలం, రాజనాల, మిక్కిలినేని, దేవిక, మీనాకుమారి

మనోహర్ సికింద్రాబాద్.

ఆటలు: 3-00, 6-00 మరియు 9-30 గం॥

మరియు లక్ష్మి-వరంగల్. తీరందాజ్-కరీంనగర్.

తదుపరిమార్పు:- భారత్-మహాబూబ్‌నగర్.

(Nima) —పూర్ణారిలీజ్.

8 వసంయుక్త వారము

ఆంధ్ర ప్రదేశ్ అంతటా విజయభేరి మ్రోగించు చున్నది.

జగపతి పిక్చర్స్ వారి

అన్నపూర్ణ

తా॥ జమున, జగ్గయ్య, గుమ్మడి, గిరిజ, రేలంగి, రమణారెడ్డి.

కమల్ చిత్రా రాజరాజేశ్వరి

హైద్రాబాద్. సికింద్రాబాద్. వరంగల్.

ఆటలు: 2-30, 6-00 మరియు 9-30 గం॥

(Nima) శ్రీ నేషనల్ ఆర్టు పిక్చర్స్ విడుదల.

వసంతైన 10 వ సంయుక్త వారము

గురుదత్ సమర్పించు

చౌధ్వీంకా చాంద్

తా॥ వహీదారెహమాన్, గురుదత్, జానీవాకర్.

ప్రభాత్ హైద్రాబాదు. అలంకార్ సికింద్రాబాదు.

ఆటలు: 3-30, 6-30 మరియు 9-30 గం॥

(Trupix) — జ్యోతి డిస్ట్రిబ్యూటర్స్ విడుదల.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

సాంకేతిక విద్యాశాఖ

వృత్తిపనివారలకు శిక్షణపథకము - ప్రవేశములు - ఆగస్టు 1960

ఈ క్రింద పేర్కొనబడిన పారిశ్రామిక శిక్షణ సంస్థలలో, నిపుణత గల వృత్తి పనివారలకు శిక్షణపథకం క్రింద వివిధ సాంకేతిక, వృత్తి పనులలో శిక్షణ పొందుటకు దరఖాస్తులు కోరబడుతున్నవి.

ఆంధ్ర ప్రాంతం

1. పారిశ్రామిక శిక్షణ సంస్థ - కాకినాడ

సాంకేతిక పనులు:-

1. మెకానిక్ (మోటారు), 2 మెకానిక్ (పనిముట్లు), 3, ఎలక్ట్రీషియనులు, 4. మెకానిక్ (రేడియో), 5. డ్రాఫ్స్‌మన్ (సివిల్), 6. టర్నర్లు, 7. ఫిట్టర్లు, 8. వడ్రంగులు, 9. వెల్డర్లు (గ్యాస్-ఎలక్ట్రిక్).

వృత్తి పనులు:-

1. కత్తిరింపు, దర్జీపని, 2. పాదరక్షలు.

2. పారిశ్రామిక శిక్షణసంస్థ - ఉయ్యూరు

1. డ్రాఫ్స్‌మన్ (సివిల్), 2. ఎలక్ట్రీషియన్లు, 3. వడ్రంగులు, 4. ఫిట్టర్లు, 5. టర్నర్లు, 6. మెకానిస్టులు, 7. మౌల్డర్లు, 8. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్).

3. పారిశ్రామిక శిక్షణ సంస్థ - అనంతపురం

1. ఎలక్ట్రీషియన్లు, 2, కమ్మర పనివారు, 3. మెకానిస్టులు, 4, ఫిట్టర్లు, 5. టర్నర్లు, 6. మౌల్డర్లు, 7. మెకానికులు (మోటారు), 8. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్).

4. పారిశ్రామిక శిక్షణ సంస్థ - నెల్లూరు

1. ఎలక్ట్రీషియన్లు, 2, డ్రాఫ్స్‌మన్ (సివిల్), 3. ఫిట్టర్లు, 4 టర్నర్లు, 5. మెకానిస్టులు, 6. వడ్రంగులు, 7. వెల్డర్లు (గ్యాస్ ఎలక్ట్రిక్).

5. పారిశ్రామిక శిక్షణ సంస్థ - విశాఖపట్టణము

1. లైన్‌మెన్, వైర్‌మెన్, 2. మౌల్డర్లు, 3. టర్నర్లు, 4. ఫిట్టర్లు, 5. వడ్రంగులు, 6. ప్లంబర్లు, 7. పాటర్న్ మేకర్స్, 8. మెకానిస్టులు, 9. షీట్ మెటల్ వర్కర్లు, 10. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్)

తెలంగాణా ప్రాంతము

6. పారిశ్రామిక శిక్షణ సంస్థ - మల్లేపలి, హైదరాబాదు

సాంకేతిక పనులు:-

1. ఎలక్ట్రీషియన్లు, 2. మెకానికులు (మోటారు), 3. మెకానికులు (రేడియో), 4. మెకానికులు (ఐ. సి. ఇంజన్లు), 5. ఫిట్టర్లు, 6. టర్నర్లు, 7. మౌల్డర్లు, 8. మెకానిస్టులు, 9. షీట్ మెటల్ వర్కర్లు, 10. ఎలక్ట్రోప్లేటర్లు, 11. లైన్‌మెన్, వైర్‌మెన్, 12. వడ్రంగులు, 13. కమ్మర పనివారు, 14. ప్లంబర్లు, 15. వెల్డర్లు (గ్యాస్, ఎలక్ట్రిక్).

వృత్తి పనులు

1. కత్తిరింపు, దర్జీపని, 2. ఇండ్లు కట్టువారు, 3. సూటుకేసులు తదితరతోలు సామానులు తయారుచేయుట, 4. ఉన్ని వస్త్రములు నేయుట, 5. ఫ్యాన్సీ ఫినిషింగ్, ఫ్యాబ్రిక్స్ నేయుట, 6. చేము లెత్తుముపని.

7. పారిశ్రామిక శిక్షణ సంస్థ - నిజామాబాదు

సాంకేతిక పనులు

1. డ్రాఫ్స్‌మన్ (సివిల్), 2. డ్రాఫ్స్‌మన్ (మెకానికల్), 3. ఫిట్టర్లు, 4. టర్నర్లు, 5. ఎలక్ట్రీషియన్లు, 6. లైన్‌మన్, వైరీమన్, 7. కమ్మర పనివారు, 8. మెకానిస్టులు, 9. వడ్రంగులు.

వృత్తి పనులు

1. కత్తిరింపు, దర్జీపని.

8. పారిశ్రామిక శిక్షణ సంస్థ - వరంగల్

1. డ్రాఫ్స్‌మన్ (సివిల్), 2. సర్వేయర్లు, 3. వడ్రంగులు, 4. టర్నర్లు, 5. కమ్మర పనివారు, 6. ఫిట్టర్లు, 7. మౌల్డర్లు.

9. అల్లాదీన్ సాంకేతిక శిక్షణ సంస్థ-బొగ్గులకుంట, హైదరాబాదు (ప్రయివేట్ ఎయిడెడ్)

1. మెకానికులు(మోటారు), 2. ఫిట్టర్లు, 3 టర్నర్లు, 4. వడ్రంగులు, 5. ఎలక్ట్రీషియనులు, 6. కమ్మర పనివారు.

శిక్షణ, వయస్సు:

వర్క్‌షాపు నిబంధనల ప్రకారం ఫ్యాక్టరీలలో ఆరు మాసముల పాటు తప్పనిసరిగా పొందవలసిన శిక్షణతోసహా సాంకేతిక పనులకు శిక్షణ కాలము రెండు సంవత్సరములు. కాకినాడ, హైదరాబాదు, నిజామాబాదులలోని పారిశ్రామిక శిక్షణ సంస్థలలో వృత్తి పనుల శిక్షణ కాలపరిమితి ఒక సంవత్సరము. అభ్యర్థుల వయస్సు 1960 ఆగస్టు 1 వ తేదీ నాటికి 16 సంవత్సరములకు తక్కువకాకుండానూ, 25 సంవత్సరములకు మించకుండాను ఉండవలెను. రాష్ట్రంలోని మాజీసైనికులు ఒకవేళ ఇతరత్రావారు ప్రవేశార్హతలు కలిగి వున్నట్లయితే, వయస్సుతో నిమిత్తము లేకుండా వీటిలో ప్రవేశము పొందుటకు అర్హులగుదురు. నిమ్నజాతులు, నిమ్నతెగల అభ్యర్థులకు గరిష్ఠవయః పరిమితి 1960 ఆగస్టు 1 వ తేదీనాటికి 28 సంవత్సరములు. నూటికి 12 న్నర వంతుల సీట్లు నిమ్నజాతుల అభ్యర్థులకొరకూ, 5 వంతుల సీట్లు నిమ్నతెగల అభ్యర్థులకొరకు ప్రత్యేకించబడినవి.

విద్యార్హతలు:

1. డ్రాఫ్స్‌మన్, (సివిల్,) 2. డ్రాఫ్స్‌మన్, (మెకానికల్,) 3. ఎలక్ట్రీషియనులు, 4. సర్వేయర్లు, 5. మెకానికులు, (రేడియో) 6. మెకానికుల (పనిముట్లు) కోర్సు శిక్షణ పొందదలిచిన అభ్యర్థులు, ఎస్. ఎస్. ఎస్. యల్. సి లేదా హెచ్. యస్. సి. లేదా మెట్రిక్యులేషన్ లేదా వాటితో సమానమైన ఏదైనా పరీక్షలో ఉత్తీర్ణులై యుండవలెను. లెక్కలు తీసికొని కృతార్థులైన వారికి ప్రాధాన్యత యివ్వబడును. మిగతా పనులలో శిక్షణ పొందగోరిన అభ్యర్థులు, ఎస్. ఎస్. ఎల్. సి. లేదా హెచ్. ఎస్. సి. లేదా మెట్రిక్యులేషనుకు రెండు సంవత్సరాలు తక్కువైన తరగతి వరకు చదివి వుండవలెను.

యోగ్యులైన అభ్యర్థుల విషయంలో ఒకవేళ వారు ఇతరత్రా అర్హతలు కలిగివున్నట్లయితే గరిష్ఠ వయఃపరిమితి, విద్యాయోగ్యతలకు సంబంధించిన నిబంధనలు సడలింపబడవచ్చును. ఈ అన్నికోర్సులకూ స్త్రీలు, పురుషులు కూడా ప్రవేశానికి దరఖాస్తులు పెట్టుకోవచ్చు.

ఉపకార వేతనాలు:

శిక్షణ ఉచితముగా యివ్వబడును. శిక్షణకు చేర్చుకోబడిన అభ్యర్థులలో మూడవవంతు మందికి నెలకు రు. 25 చొప్పున ఉపకార వేతనాలు యివ్వబడతాయి. వీటిలో నూటికి 12 న్నర వంతుల ఉపకార వేతనాలు నిమ్నజాతుల అభ్యర్థులకూ, 5 వంతులు నిమ్నతెగల అభ్యర్థులకు కేటాయించబడతాయి.

నిర్ణీత దరఖాస్తు ఫారములను ఆయాశిక్షణసంస్థల ప్రిన్సిపాల్స్ వద్దనుండి స్వయంగా వెళ్లిగాని, లేదా స్వంత చిరునామా వ్రాసిన కవరుపై 15 నయాపైసల తపాలాబిళ్లలు అంటించి పంపుతూ లిఖితపూర్వకంగా కోరిగాని పొందవచ్చు. అభ్యర్థులు తాము ఏ శిక్షణ సంస్థలోనైతే ప్రవేశింపదలచినారో ఆ సంస్థ ప్రిన్సిపాల్‌కి పూరించిన దరఖాస్తుఫారములను నేరుగా పంపవలెను.

(మొదటి పేజీ తరువాయి)

శ్రీ వేమయ్య అడిగిన మరొక ప్రశ్నకు మంత్రి శ్రీ రంగారెడ్డి జవాబు చెబుతూ నాగార్జునకొండవద్ద గల పురాతన శిల్పాల త్రవ్వకము పనిపూర్తిఅయిందనీ, వాటిలో ప్రత్యేకించి మెచ్చుకోతగ్గ శిల్పాలను నాగార్జునకొండపైకి చేర్చటానికి చర్యలు గైకొంటున్నామన్నారు.

శ్రీ జనవ మాణయ్య ప్రశ్నకు సహకారమంత్రి జవాబిస్తూ జోగిపేట టాకాను పునరుద్ధరించాలా లేక రద్దు పరచాలా అన్న విషయమై సహకార సంఘాల రిజిస్ట్రారు ఆలోచిస్తున్నారన్నారు.

మధ్యయుగపు ఈ శిల్పకళా ఖండాలు చారిత్రక ప్రాధాన్యం కల వనికూడా ఆయన అన్నారు.

శ్రీ పి. వి. రాజేశ్వరరావు అడిగిన ప్రశ్నకు ప్రణాళికామంత్రి సమాధానం చెబుతూ సిద్దిపేట తాలూకాలోని కుక్‌నూరుపల్లి గ్రామ సర్పంచ్ మీద పంచాయతీ సభ్యులు చేసిన ఫిర్యాదును విచారించుటకై ప్రభుత్వం చర్య తీసుకుందనీ ప్రస్తుతం ఆ ఫిర్యాదు విచారించబడుతున్నదని అన్నారు.

శ్రీ బి. సుబ్బారావు అడిగిన ప్రశ్నకు ముఖ్య మంత్రి శ్రీ సంజీవయ్య లిఖిత పూర్వకంగా జవాబు చెబుతూ అన్నిరకాల గెజిటెడ్ పదవులకు షెడ్యూల్డు కులాలకు, షెడ్యూల్డు ట్రైబ్సుకు రిజర్వేషను చేయలేదన్నారు- ప్రతి పంద నియామకాల్లో 16 నియామకాలు అలా రిజర్వు చేయబడేవి ఉన్నాయన్నారు.

శిస్తురెమిషన్

శ్రీ జి. సూర్యనారాయణ అడిగిన ప్రశ్నకు ఉపముఖ్యమంత్రి శ్రీ కె.వి. రంగారెడ్డి సమాధానం చెబుతూ విశాఖపట్టణం జిల్లాలోని విజయనగరం, భీమునిపట్టణం, శృంగవరపుకోట తాలూకాలలో క్రితం సంవత్సరం సంభవించిన వర్షాలవల్ల పంటలు దెబ్బతిన్నందుకు ప్రభుత్వం శిస్తు రెమిషన్ ఇచ్చిందన్నారు.

చిత్తూరుజిల్లావిద్యుచ్ఛక్తి పథకాలు

శ్రీ పి. గోపాల్ రెడ్డి ప్రశ్నకు పి.డబ్ల్యు.డి. మంత్రి జవాబు చెబుతూ చిత్తూరు జిల్లాలో 47విద్యుచ్ఛక్తి అభివృద్ధి పథకాలను మంజూరు చేసిందనీ, కార్య నిర్వహణకు వేచియున్నదనీ, ఈ అభివృద్ధి పథకాలకై 61 లక్షల 78 వేల ఖర్చు కాగలదని రాష్ట్ర విద్యుచ్ఛక్తి బోర్డు అంచనా వేసిందన్నారు.

గ్రామీణ విద్యుత్ పథకాల క్రింద ప్రభుత్వము బోర్డుకు అడనముగా సహాయపడినదనీ బోర్డు అడిగిన దానికంటెకూడ ఈమంజూరీ తక్కువ అయినప్పటికీ1960-61లో ఎలాసహాయపడే వీలున్నదీ ప్రభుత్వము ఆలోచిస్తుందనీ పబ్లిక్ వర్క్సు మంత్రి శ్రీ అల్లూరి అన్నారు.

డాక్టర్ల కొరత

శ్రీ స్వర్ణ వేమయ్య అడిగిన ప్రశ్నకు ఆరోగ్య, వైద్యశాఖ మంత్రి శ్రీ పి. వి. జి. రాజు సమాధానము చెబుతూ రాష్ట్రములో 1,589 డాక్టర్లు, 1593 నర్సులు, 763 మంత్రసానులు కలరనిన్నీ,ఇంకా 1218పైగా డాక్టర్లు కావాలనీ చెప్పారు.

ఈ డాక్టర్ల కొరతను తీర్చుటకై రిటైరుఅయిన అసిస్టెంటు సర్జన్‌లకు మరల ఉద్యోగముల నివ్వాలన్నారు. ఎల్.ఎమ్ పి, డి.ఎం అండ్ ఎస్, ఎల్.ఎమ్ అండ్ ఎస్. లలో శిక్షణ పొందిన వారికి తాత్కాలికముగా ఉద్యోగాలను ఇచ్చారనీ, వైద్యకళాశాలల్లోని సీట్లు పెంచారనీ, కొత్తగా వైద్యకళాశాలలను ప్రారంభించాలనీ శ్రీ పి.వి.జి. రాజు తెలియజేశారు.

ప్రాజెక్టు నిర్మాణాలలో చనిపోయిన వారికి నష్టపరిహారాలు

శ్రీ ధర్మభిక్షం అడిగిన ప్రశ్నకు కార్మిక, వ్యవసాయ మంత్రి శ్రీ రామచంద్రారెడ్డి జవాబు చెబుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్మాణములోగాని, మూసీప్రాజెక్టు నిర్మాణములోగాని, దెబ్బలు తగిలిన లేక ప్రాణాలు పోగొట్టుకొనిన ఉద్యోగులకై ప్రభుత్వము 85 వేల 610రూపాయలను మంజూరు చేసిందనీ నాగార్జునసాగర్ ప్రాజెక్టువద్ద సంభవించిన ప్రమాదములో 38 కార్మికులు చనిపోయారని, మూసీవద్ద సంభవించిన దానిలో 2 చనిపోయారనీ తెలియజేశారు.

చైనా సవాలును ఇండియా ఎదుర్కొనగలదు

పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ విశ్వాసం

న్యూఢిల్లీ, జులై 1

కాశ్మీర్ సమస్యా పరిష్కారానికి ప్రజాభిప్రాయ సేకరణే కావాలని పాకిస్తానిప్పుడు పట్టుబట్టలేదని గత వారం పాకిస్తాన్ అధ్యక్షుడు అయూబ్ తనతో అస్పష్టంగా అన్నట్టు రాజ్యసభ సభ్యుడు డా॥ రఘువీర్ యిచ్చట అన్నారు. భారత రక్షణే పాకిస్తాన్ రక్షణనీ, కాశ్మీరు నుండి ఉభయ సేనలను తరలించిన చైనానుండి తన సరిహద్దులను ఇండియా సమర్థనీయంగా రక్షించుకోగలుగుతుందిఅని అయూబ్‌ఖాన్ తనతో అన్నట్లు డా॥ రఘువీర పత్రికా ప్రతినిధుల సమావేశంలో అన్నారు. కాశ్మీర్ సమస్యా పరిష్కారానికి ఇండియా-పాకిస్తాన్‌లకు అంగీకారయోగ్యమైన పరిష్కారమేదైనా తాను అంగీకరించుటకు ప్రెసిడెంటు అయూబ్ సిద్ధంగా ఉన్నాడన్నారు డా॥ రఘువీర. ప్రెసిడెంట్ అయూబ్‌ను డా॥ రఘువీర జూన్ 25, 26 తేదీలలో ముర్రీలో కలిశారు. కాశ్మీర్ సమస్యా పరిష్కారనికి ఒక స్పష్టమైన సలహా నివ్వకపోయినా ఉభయ దేశాల గౌరవ ప్రపత్తుల కాపాడే యే రాజీమార్గానైనా ప్రెసిడెంటు అయూబ్ అంగీకరించుటకు సిద్ధంగా వున్న ట్టగుపించాడన్నారు. ఈ సందర్భంలో ఏ ఒప్పందాన్నివైనా అంగీకరిస్తానన్న విశ్వాసాన్ని ప్రెసిడెంటు అయూబ్ తనకిచ్చాడని డా॥ రఘువీర అన్నారు. చైనా ప్రమాదం ఒక భారతదేశానికే గాక యావత్ప్రాంతానికి గలదన్న భావన అయూబ్ కలిగియున్నట్లు ఆ సంభాషణలవల్ల గ్రహించానన్నారు. కాశ్మీర్ యుద్ధవిరమణ రేఖవద్ద 80 శాతం భారత సైన్యమున్నట్లు అయూబ్ భావిస్తున్నాడనీ, సంఖ్యలో చైనా సైన్యం అధికంగావున్నా తన పూర్తి బలాలను ఉత్తర సరిహద్దున కేంద్రీకరించిన, చైనా సవాలును భారతదేశం ఎదుర్కొన గలదన్న విశ్వాసం అయూబ్ కలిగి ఉన్నాడన్నారు డా॥ రఘువీర.

దొంగకరెన్సీనోట్ల ముద్రణ కేసు

6 గురికి జైలుకష్టడీ విధిస్తూ సబ్‌మేజిస్ట్రేట్ ఉత్తర్వు

కోయంబత్తూరు, జులై 1

వందరూపాయల దొంగ కరెన్సీ నోట్లను ముద్రించినందేరానికి ప్రస్తుతం అరెస్టులోఉన్న స్థానిక పారిశ్రామికుడు శ్రీ జి. కృష్ణన్‌తోసహా ఆరుగురు వ్యక్తులనుజైలుకష్టడీకి రిమాండు చేస్తూ ఫౌన్ సబ్ మెజిస్ట్రేట్ ఉత్తర్వు లిచ్చారు.

ఇలా రిమాండుచేయబడిన ఇతర వ్యక్తులుబీరుఆర్. పెరియస్వామి,సింగనల్లూరులోని జనార్దనమిల్లుమేనేజర్), బాలకృష్ణ మురళీధర్ (కాలికట్‌వర్తకుడు), వడివేలుపిళ్ళై, బాలసుందరం, నారాయణ అసరీ.

రేపటితో 15 దినాల రిమాండు పూర్తిఅయిపోతుంది కాబట్టి కృష్ణన్, బాలసుందరం, వడివేలుపిళ్ళలను తిరిగి రేపు హాజరుకావాల్సిందిగా ఫౌన్‌సబ్ మేజిస్ట్రేట్ అన్నారు.

కృష్ణన్‌ను మద్రాసు పోలీసులు జూన్ 17 న అరెస్టుచేశారు. అతనిని సెంట్రల్ జైలులో స్పెషల్ తరగతిలో ఉంచాలనికూడా సిఫార్సుచేయడం జరిగింది.

జూబిలీహిల్స్‌నుండి జరిగే ఉపఎన్నిక

నలుగురిచే నామినేషన్‌ల ఉపసంహరణ

హైదరాబాద్, జులై 1

జూబిలీహిల్స్ నియోజకవర్గము నుండి రాష్ట్రశాసనసభకు జరుగనున్న ఉపఎన్నికసందర్భంగా నలుగురునామినేషన్‌లు ఉపసంహరించుకోగా యిక శ్రీమతి రోడామిస్త్రీ (కాంగ్రెసు), జమీల్ అహ్మద్ బేగ్ (కాన్సోలిడేషన్‌కు ఎన్నికయిన మజ్లిస్ సభ్యుడు), మహ్మద్ హాఫీజుద్దీన్, ఎ.ఎ. గాంధీ (స్వతంత్రులు) పోటీకి నిలిచారు. పోలింగు జులై 24 న జరుగుతుంది.

అభ్యర్థులు తమవయస్సు, విద్యార్హతలను ధృవపరచు సర్టిఫికెట్లయొక్క అసలు ప్రతులను ఇంటర్వ్యూ సమయంలో చూపవలెను. ఇంటర్వ్యూ తేదీని అభ్యర్థులకు ఆయాశిక్షణసంస్థల ప్రిన్సిపాల్ నేరుగా తెలియపరుస్తారు.

పూరించిన దరఖాస్తులు ఆయాప్రిన్సిపాల్స్‌కు, 1960 జూలై 20 వ తేదీలోపల చేరవలెను.

ఇంటర్వ్యూకు పిలిచిన యెడల అభ్యర్థులు తమ సొంత ఖర్చులతో హాజరు కావలెను.

ఈ డైరెక్టరు కార్యాలయం చిరునామాకు పంపబడే పూరించిన దరఖాస్తు ఫారములుగానీ లేదా దరఖాస్తు ఫారములను కోరుతూ చేరుఅభ్యర్థనలు కాని తోసిపుచ్చబడగలవు.

సాంకేతిక విద్యాశాఖ డైరెక్టరు

ఆంధ్రప్రదేశ్ - హైదరాబాదు.

రాకపోకలు

ముఖ్యమంత్రి శ్రీ దామోదరం సంజీవయ్య జులై 2 వ తేదీ ఉదయం విజయవాడనుంచి హైదరాబాదుకు తిరిగి వస్తారు.

ప్రణాళికా శాఖామంత్రి శ్రీ పిడతల రంగారెడ్డి, జులై 3వ తేదీమధ్యాహ్నం బయలుదేరి కరీంనగరం జిల్లా నిర్మల్‌కు వెళ్లి అదే రోజు రాత్రి హైదరాబాదుకుచేరుకుంటారు. ఆయన తిరిగి జులై 4 వ తేదీ రాత్రి బయలుదేరి నిడదవోలువెళ్లి అచ్చటినుంచి భీమవరం వెడతారు. జులై 6 వ తేదీ ఉదయం హైదరాబాద్ కుతిరిగివస్తారు.

చేనేత సంఘ వ్యవహారాలచర్చ

హైదరాబాద్, జులై 1

రాష్ట్ర లఘు పరిశ్రమల మంత్రి చేంబర్‌లో జూన్ 28 న జరిగిన సమావేశంలో హైదరాబాదు చేనేత కేంద్ర సహకార సంఘ అధ్యక్షుడు శ్రీవిఠల్‌రావు పవర్స్ ఆంధ్రప్రదేశ్ చేనేత డైరెక్టర్ శ్రీ సి. జోసఫ్ రెడ్డి పాల్గొన్నారు. ప్రాథమిక చేనేత సహకార సంఘాలు, అపెక్స్ సంఘాలు పోగుచేసిన నిలువల ధరలు పడిపోవుటవల్ల సంభవించిన నష్టాన్ని పూడ్చుట,ఆడిట్ ఫీసు మొత్తాన్ని రద్దుపరచేవిషయాన్ని సమావేశం చర్చించినది. చర్చల తర్వాత ఈవిషయాలనుసానుభూతితో పరిశీలించడం జరుగుతుందనిశ్రీకొండా లక్ష్మణ్ అన్నారు. గిరాకి అంతగా వుండని రోజులాసన్న మవుతున్నవి గాబట్టి స్వల్ప కాలిక ఋణాలను వెంటనే మంజూరుచేయుట జరుగాలన్నారు శ్రీలక్ష్మణ్. ఈమొత్తం కొద్ది రోజులలోనే మంజూరు చేయబడుతుందన్నారు. అపెక్స్ సంఘములో రాష్ట్రం పాల్గొనేందుకు అవసరమైన చర్యలు తీసుకునేందుకు మంత్రిగారు అంగీకరించారు. ఇందుకు రు 6.4 లక్షలవుతాయన్నారు.

హాయ్యర్ సెకండరీ, మల్టీపర్పస్ పరీక్ష

హైదరాబాద్, జులై 1

ఆంధ్రప్రాంతం నిబంధనలక్రింద హాయ్యర్ సెకండరీ పరీక్షకు, మల్టీపర్పస్ స్కూల్ లీవింగ్ సర్టిఫికెటు పరీక్షకు ఒకసారి కూర్చుని తప్పిన అభ్యర్థులు అక్టోబరు పరీక్షలకుకూర్చోటానికి పరీక్ష ఫీజును జరిమానా లేకుండా జులై 21 వ తేదీలోపల ప్రభుత్వ ట్రెజరీలో చెల్లించాలి. జులై 21 ఆగస్టు 1 వ తేదీల మధ్య చెల్లించే అభ్యర్థులు రు. 2 ల జరిమానాతో కట్టాలి. దరఖాస్తు ఫారాలు ప్రభుత్వ పరీక్షల కమీషనరు, గన్‌ఫౌండ్రీరోడ్డు, హైదరాబాదు-1 చిరునామా దారుని వద్దనుండి పొందవచ్చు. పూర్తి వివరాలకు 30-6-60 వ తేదీ ఆంధ్రప్రదేశ్ గజెటులో ప్రచురణమైన ప్రటనను చూసుకోవచ్చు.

శ్రీకొమరవోలు వారి కావ్యపఠన సదస్సు

కాకినాడ, జులై 1

కాకినాడ ఆంధ్ర కళా పరిషత్తు ఆధ్వర్యాన కావ్యపఠన సదస్సు జూన్ 27 న జరిగింది. పరిషత్ ప్రధాన కార్యదర్శి రమణ శ్రీ కావ్యకర్త శ్రీ కొమరవోలు వెంకటసుబ్బారావును పరిచయం చేశారు.

శ్రీ కొమరవోలువారు తాము రచించిన "అమరశ్రీ" పద్యకావ్యమును పఠించుటకుపూర్వం తమకావ్యములోని కథా వస్తువును, ప్రచ్ఛన్న శంకరాచార్యులైన బుద్ధుని సిద్ధాంత వేదాంత విశిష్టతనువివరించిరి. పిమ్మట "మృత్యులగ్నము" అను తమ రెండవ కావ్యమునందలి కావ్యాత్మ విజయ సంబంధమైన విషయమును వివరించుచు పఠించిరి.

"బతిహాసికసమ్రాట్" శ్రీబండారు తమ్మయ్య, కావ్యకర్త ప్రదర్శించిన అపార శ్రేమునీ పరిశ్రమను అభినందించిరి.

పదవ తరగతి ప్రారంభోత్సవం

ఎండపల్లి, జులై 1

శ్రీ లేక్ నారాయణ్ (కరీంనగరం జిల్లాపరిషత్కార్యదర్శి)చే "ఎండపల్లి" గ్రామములో మాధ్యమికోన్నత పాఠశాలలో పదవతరగతి జూన్ 27 న ప్రారంభించబడింది. శ్రీ పి. జనార్దన స్వామి (ప్రధానోపాధ్యాయులు) నివేదిక సమర్పించారు. పాఠశాల అవసరములు సాధ్యమైనంతవరకు తీర్చగలమని శ్రీ లేక్ నారాయణ్ నుడివిరి. గ్రామ పంచాయతి అధ్యక్షుడు శ్రీగోపాల్ రెడ్డి కృతజ్ఞతలు సమర్పించిన అనంతరం తేనీటి విందు జరిగింది.

మల్లేపల్లి కాంగ్రెసుకు ప్రతిష్ఠా స్థానంకాదు

ప్రతిష్ఠా స్థానమైన హైకోర్టు నియోజక వర్గంలో కాంగ్రెసు గెలుపొందిందని పార్టీ ప్రతినిధి వివరణ

హైదరాబాదు, జులై 1

హైదరాబాదు కార్పొరేషన్‌లోని మల్లేపల్లి నియోజక వర్గపు ప్రతిష్ఠా స్థానాన్ని కాంగ్రెసు కోల్పోయింది అన్న రాజకీయ పార్టీల ప్రచారాన్ని ఖండిస్తూ నేడొక కాంగ్రెస్ ప్రతినిధి ఛాలెంజి చేశారు.

ఉన్న పరిస్థితినివివరిస్తూ కాంగ్రెస్‌కు అసలు మల్లేపల్లి నియోజకవర్గము ప్రతిష్ఠా స్థానము కాదనీ, అయినా కాంగ్రెసు తనదృష్టిని ఆఒక్క నియోజక వర్గముపైనే కేంద్రీకరించలేదని అయన అన్నారు. నిజంగా అసలు ఈ స్థానం మజ్లిస్-ఇత్తెహాద్ - మజ్లిమీన్‌కు ఆనియోజక వర్గంలో నిలబడ్డ దాని ప్రెసిడెంటు కుమారుడు సుల్తాన్ సలాఉద్దీన్‌కు ప్రతిష్ఠా స్థానమని వివరించారు. 800 ఓట్లు అధికంగావచ్చి మజ్లిస్ అభ్యర్థి గెలిచినంత మాత్రాన మల్లేపల్లి ఓటర్లందరూ కాంగ్రెసుకు పూర్తి వ్యతిరేకులని చెప్పుట భావ్యం కాదన్నారు. కాంగ్రెసుయొక్క మత విరహిత విధానానికి మల్లేపల్లి ఓటర్లందరూ వ్యతిరేకులని ఖచ్చితంగా చెప్పలేమనీ, ప్రక్కనున్న ఆగాపుర నియోజక వర్గములో కాంగ్రెసు అభ్యర్థి కేవలం 42 ఓట్లతో అపజయ మొందారనీ చెప్పారు. మొత్తంమీద మజ్లిస్ పార్టీ అభ్యర్థులు చాలచోట్ల చాల స్వల్ప ఓట్ల మెజారిటీతోనే గెలుపొందారని కూడా ఆయన అన్నారు.

హైకోర్టు నియోజకవర్గపు అభ్యర్థి, మండల కాంగ్రెసు అధ్యక్షుడు అభ్యర్థుల ఎంపికముందు ఎదురుతిరగడం వలన ఒకవిధంగా కాంగ్రెసుకు ఇది ప్రతిష్ఠా స్థానం కావచ్చునీ. అయినా అచట కొత్తగా నిలబెట్టిన కాంగ్రెసు అభ్యర్థి ఎన్నికయినాడనీ ఆయన తెలిపారు. 57 నియోజక వర్గాలలోను కాంగ్రెసు దాని కార్యకర్త నియోగించిందనీ సాధ్యమయినన్ని స్థానాలలో గెలవాలని తలపెట్టిందనీ ఆయన ప్రస్తావించారు.

చివరకు పట్టణంలోని కొన్నిభాగాల్లోని వారంతా మతపక్షపాతం కలిగివున్నారన్న ప్రచారం కొందరు చేసినందుకు ఆయన విచారం వ్యక్తం చేశారు.

అనుకున్నంతవిజయం కాంగ్రెసుకు లభింపకపోయినా దాని నిర్ణీత ప్రణాళిక ననుసరించి పౌరహక్కులను నిరుద్యోగ నివారణను పరమత సహనంతో సాధించగలదని ఆయనఉద్ఘాటించారు.

స్టాలిన్‌గ్రాడ్‌కు రాష్ట్రపతి చేరిక

స్టాలిన్‌గ్రాడ్, జులై 1

మాస్కోనుండి భారత రాష్ట్రపతి డా॥ రాజేంద్రప్రసాద్ నేడు స్టాలిన్‌గ్రాడ్ చేరుకొన్నారు.

గ్రామ వార్తలు

తాడిచర్లలో మాధ్యమిక పాఠశాల ప్రారంభోత్సవము

తాడిచర్ల, జులై 1

తాడిచర్లలో సంపూర్ణ మాధ్యమిక పాఠశాలలో 8 వ తరగతి ప్రారంభోత్సవము స్థానిక రేంజర్ ఆఫీసరగు శ్రీ రామచంద్రారెడ్డిచే జరుపబడెను. మంథెన సమితిఅధ్యక్షులగు శ్రీ పి. కిషన్ రావుఅధ్యక్షతన ఆదర్శపాఠము (రేడియో)గురించి శ్రీయు. దుర్గరాజు యిచ్చియుండిరి. అతర్వాత శ్రీ సి. రాజిరెడ్డి పాఠశాలకు గల అవసరములు, ఇక్కట్లు క్లుప్తముగా నివేదించిరి. శ్రీ గుల్కోడి శ్రీరాముల ప్రారంభోపన్యాసానంతరము శ్రీ వెంకటయ్య, శ్రీ రామచంద్రారెడ్డి మాధ్యమికపాఠశాలలోనే తృప్తిపడక మన పిల్లల ఉన్నత విద్యాభివృద్ధికై ఉన్నత పాఠశాల ఎంతేని అవసరమన్నారు. ఈగ్రామమునకు పరిసరములలో 600 జనాభాగల గ్రామములు గలవు. ఆ గ్రామములు చాలా వెనుకబడిన ప్రాంతములు. వాటిలో ఏకోపాధ్యాయ పాఠశాలలు నెలకొల్పాలని కూడా కోరబడినది.

ఈసందర్భమున శ్రీసత్యనారాయణ పట్వారి ఒక రేడియోను పాఠశాలకు బహూకరించిరి. శ్రీ నారాయణరావు లౌడుస్పీకర్, శ్రీ రామచంద్రారెడ్డి గోడ గడియారము ఇవ్వగలమని హామీ ఇచ్చిరి.

.....

కరట్లగూడెం పాఠశాల

ఖమ్మం, జులై 10

పాలేరు బ్లాకులోని కరట్లగూడెంలోని పాఠశాలవిద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అమలుపరిచే పథకానికి డి. ఇ. ఓ సయ్యద్ దావూద్ హుస్సేనీ జూన్ 28 న ప్రారంభోత్సవం జరిపారు. పంచాయత్ సమితి అధ్యక్షుడు శ్రీ రావులపాటి సత్యనారాయణరావుఅధ్యక్షత వహించారు

వాణిజ్యవ్యాపారము

మెసర్స్ కల్వసూర్యనారాయణ కర్పంట్ అండ్ కమీషన్ ఏజంట్
ఉస్మాన్‌గంజ్-హైదరాబాదు
ఫోన్ నెం. 4412
హైదరాబాద్, జూలై 1
(వల్లా ఒక్కంటికి 120 శేర్లు)

దొడ్డు బియ్యం	57-8-0	62-0-0
నెంబర్ వన్ సాంబర్లు పా॥	60-8-0	65-8-0
కొత్తసాంబర్లు	73-0-0	78-0-0
నూకలు	37-0-0	48-0-0
వరంగల్ సాం. పా॥		
కందులుపెద్దవి కో॥	52-0-0	55-0-0
కందులుచిన్నవి కో॥	44-0-0	46-8-0
మినుములు	50-0-0	54-0-0
పెసలు	47-12-0	48-4-0
బెల్లం	52-0-0	60-0-0
పెసళ్ళు కో॥	47-0-0	58-0-0
తెల్లజొన్నలు	49-0-0	52-8-0
పచ్చజొన్నలు	47-0-0	48-8-0
మిరపకాయలు	215-0-0	280-0-0
పసుపు	123-0-0	126-0-0
అల్లిగడ్డ కో॥	12-0-0	15-0-0
చింతపండు కో॥	85-0-0	118-0-0
నల్లవులువలు	39-12-0	41-0-0
తెల్లనువ్వులు	125-0-0	139-0-0
సద్దలు	45-0-0	46-0-0
పెద్ద కందిపప్పు	75-0-0	78-0-0
చిన్న కందిపప్పు	64-0-0	67-8-0
సెనగపప్పు	56-8-0	57-8-0
పెసరపప్పు	71-0-0	73-0-0
మినుప పప్పు	71-0-0	72-0-0
ఆముదాలు	72-0-0	74-0-0
లంకపిండి	51-0-0	51-4-0
ఇలాతికాయ చి॥	68-0-0	720-0-
యెర్రనువ్వులు	115-0-0	120-0-0
యెర్రబొబ్బర్లు	52-0-0	53-0-0
(12 శేర్ల మణుగు)		
అల్లం	9-0-0	10-8-0
యెల్లిగడ్డ	5-0-0	6-12-0
పట్టుమానె	20-8